# వెలుగు నీడలు

(పరిచర్యలో శ్రమల స్వీయానుభవము)

రచయిత:

కీ॥శే॥ **పాస్టరు పురుషోత్తము చౌధరి**

శతజయంతి (1906-2006) ప్రచురణ

ప్రచురణ కర్త:

**జేమ్సు జయశీల్ చౌధరి**

VELUGU - NEEDALU

BY

PASTOR PURUSHOTTAM CHOUDHURY

PUBLISHER:

JAMES JAYASEEL CHOUDHURY

COVER DESIGN & PRINTERS:

SIRI GRAPHICS, GUDIVADA

© 2006

PRINTED: 1000 COPIES

PRICE: Rs. 20/-

For Copies and Further information:-

Purushottam Choudhury Publications

25-New V.T. Colony,

Nalgonda - 508 001.

# తొలి పలుకులు

సృష్టికర్త, సర్వాంతర్యామి, సర్వోన్నతుడు - భగవంతుడు. ఆయన సృష్టి - విశాల విశ్వం. విశ్వానికి కిరీటం - మానవుడు. మానవుడు దైవాంశసంభూతుడు కాదు, గాని దేవుని ఔన్నత్యానికి, మహిమకు ప్రభల నిదర్శనం (యెషయా: 43 : 7, 21). క్రైస్తవుని. అందునా తన పనివారిని ఆయనే ఏర్పర్చుకొనెను (యోహాను 15:16). అందరి జీవితాలు అందరికి పనికిరావు. గాని కొందరి జీవితాలు ఎందరికో ఉపయుక్తం, ఆశీర్వాదం.

ఆకోవకు చెందిన వంశం - చౌధరి పురుషోత్తము కుటుంబము. 1803 లో జన్మించిన మూలపురుషుడు "పురుషోత్తము చౌధరి" 1890 లో తనువు చాలించిన, ఆయన వంశం, కుటుంబం, సువార్త పరిచర్య, సాహిత్యం నేటికి ఆంధ్ర క్రైస్తవ సంఘంలో సజీవంగా ఉన్నవనుట అక్షరసత్యం. ఆ వంశంలో మరో ఆణిముత్యం "పాస్టర్ పురుషోత్తము చౌధరి". తాతముత్తాతలనుండి అలవడిన క్రైస్తవ భక్తి విశ్వాసములకు స్థిరచిత్తుడై, సువార్త, సంఘపరిచర్యలో కలిగిన శ్రమలకు ఎదురొడ్డి, నిలిచి పర్లాకిమిడి బాప్టిష్టు (సి.బి.సి.ఎన్.సి.) సంఘమునకు మాత్రమేగాక పరిసరప్రాంతముల సంఘములకు, విశ్వాసులకు "క్రీస్తుయేసు" ని దీపస్థంభముగా నిలిచిన ధీరోధాత్తుడు - మన పాస్టర్ పురుషోత్తముడు. ఆయన చేసిన పరిచర్య, జీవితం నాటికి, నేటికి మరియు రాబోవు తరం సువార్తికులకు, బాప్టిష్టు సంఘ కాపరులకు ఎంతో ఆదర్శం, అశీర్వాదం. వయసురీత్యా పరిచర్యనుండి విరమించిన ఇంకను ఆయన చేయ ఆశించిన సేవను తన కుమారులు, కుటుంబ సభ్యులు కొనసాగించుట ఎంతైనా ముదావహం.

చౌధరిగారు స్వయంగా తనజీవిత అనుభవాలు వ్రాసియుంచుట, వాటిని సేకరించి భవిష్యత్ కొరకు సమకూర్చి ఒక పుస్తక రూపంలో వెలువరించుట భావి పరిచర్యకు ఒక సాధనం. ప్రస్తుతం విజయనగరం జిల్లా, జొన్నాడ గ్రామంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్న వారి కుమారులు జేమ్సు జయశీల్ చౌధరి గారు ఈ చిన్న పుస్తకమును సిద్ధపరచుటలో వారికున్న ఆసక్తిని ఒకదైవసేవకునిగా అభినందిస్తున్నాను. "పాస్టర్ పురుషోత్తం చౌధరి" గారి జీవిత చరిత్రకు నన్ను తొలిపలుకులు వ్రాయమని కోరటం నన్ను ఆశ్చర్యపరచింది. మరొక విధంగా గొప్ప సంతోషం కలిగించింది. ఈ సదవకాశం కలిగించినవారి కుటుంబ సభ్యులకు నానిండు కృతజ్ఞతలు.

ప్రభువు పిలుపుకు లోబడి, ఎన్నో శ్రమలకోర్చి, ప్రభువు సేవను కొనసాగించి, సేవా సత్పురుషుడుగా గణతికెక్కిన "పాస్టర్ పురుషోత్తమ చౌధరి" గారి జీవితం చదువరులైన క్రైస్తవ భక్తకోటికి మిక్కిలి దైవాశీర్వాదములు సమకూర్చునుగాక! .

కంటోన్మెంట్,
విజయనగరం,
తేది: 19-07-2006

ప్రభుపాద సేవకుడు,
రెవ|| డా|| వై.జె. రోలెండ్.

# వెలుగు-నీడలు

## పద్యకావ్యం

### సమీక్ష : రెవరెండ్ డా॥ దాన్‌బాబు

కవిసార్వభౌమ పురుషోత్తమ చౌధరి గారి వంశ వృక్షంలో వికసించిన కవితాకుసుమం మరో పురుషోత్తమ చౌధరి ! ఈ బంధుత్వాన్ని స్పష్టం చేయాలి.

జగన్నాథ చౌధరి, పురుషోత్తమ చౌదరి స్వయాన అన్నదమ్ములు. జగన్నాథంగారు జ్యేష్టులు. వీరి మునిమనమడు మన పురుషోత్తముడు. సుప్రసిద్ధ కవీశ్వరులు, సంఘనాయకుడు, కవిసార్వభౌమునిలా గణుతికెక్కాలని, వీరి పేరు పెట్టారు. అయితే, నిస్సంకోచంగా ఒకటి చెప్పుకోవాలి. కవి సార్వభౌమ పురుషోత్తముడులాంటి కవి ఆ వంద సంవత్సరాలలో ఎవరూ ఎక్కడా జన్మించలేదు. ఆ మాటకొస్తే, నేటి వరకూ ఎందరో కవులు జన్మించారు గాని ఎవరు కూడా వారంతటి ఘనులు కాలేక పోయారు. ఈ సంగతి ఆ ఇంటివారికి తెలుసు. కాని అప్పటికే చాలామంది పురుషోత్తముని పేరు పెట్టుకొన్నారు. అదృష్టవశాత్తు మన పురుషోత్తమునికి కవిత్వము అబ్బింది. పోతే, వీరి తొంభై సంవత్సరముల సుదీర్ఘ జీవితములో సగం జీవితం సంఘసేవలో పాస్టర్‌గా విరాజిల్లారు. గనుక వీరిని పాస్టర్ పురుషోత్తమ చౌధరి అని పేర్కొనడము ఉచితం. కవిత్వాన్ని, సంఘ బాధ్యతను సమర్థనీయంగా సమపాళ్ళలో నిర్వహించిన పురుషోత్తమ చౌధరి గారి శత జయంతి సందర్భంలో మరుగున పడిపోయిన ఈ పద్యకావ్యాన్ని వెలుగులోకి తీసుకొని రావడము ముదావహము. వీరి కుమారుడు జేమ్స్ జయశీల్ చౌధరీ

గారు ఈ కార్యభారాన్ని చేపట్టడం అభినందనీయం. గతంలో కవి సార్వభౌముని ద్విశత జయంతి సందర్భముగా ఆయన వ్రాసిన రచనలు రెండు సంపుటాలుగా 2003-04సంవత్సరములో ప్రచురించారు. వీరి తండ్రి గారు కూడా సెప్టెంబర్ 5న జన్మించడమే ప్రధాన కారణముగా జేమ్స్‌గారు ఈయన రచనలను ప్రచురించి విడుదల చేయుచున్నారు. ఇంతటి మహత్కార్యము చేయడం కేవలం వారి ఆత్మసంతృప్తికే అంటే సబబు కాదు. ఆంధ్రపాఠకులకు, సంఘనాయకులకు ఉపయోగపడాలనీ, తద్వారా వారు ఉద్దీపనము చెందాలని సంకల్పించి దీనికి పూనుకొన్నారు. ఈ సత్‌సంకల్పము అభినందనీయము.

" వెలుగు - నీడలు " కవి జీవితానికి అద్దంపట్టే పద్యకావ్యం. చరిత్రపుటల్ని తిరగవేస్తే కలం పట్టిన ఏ కవిజీవితము సాఫీగా సాగిపోలేదు. లక్ష్యసాధనలో అధిగమించిన మిట్టపల్లాలు ఎన్నెన్నో!

జీవితరాపిడికి రాటుతేలక పోతే గమ్యాన్ని చేరుకోవడం దుర్లభం. పాస్టర్ చౌధరి గారు దీనికి అతీతులు కాలేక పోయారు. దీపావళి, తిమిరావళి ఈ రెండింటి సమ్మేలనం ఈ పద్యకావ్యంలో ప్రతిబింబిస్తుంది. అయితే, యేసును విశ్వసించినవారు గనుక "భక్తి"కి సంబంధించిన అంశాలమీద ఎక్కువగా మనస్సును లగ్నం చేసినట్టు కనిపిస్తుంది.

ఈ పద్యకావ్యంలో మొదటి ఖండిక "స్వీయచరిత్ర" సాలూరులో జన్మించినట్టు, ఆకులతంపరలో నివాసమున్నట్టు తేటగీతి రెండు పాదాలలో ఇమిడించి - "వైభవముగా చేరుకొంటిని ప్రభుసేవ-చింతతోడ : పర్లపురి

సంఘు పాస్టరు-పదవియందు" అంటూ మొదటి పద్యాన్ని ముగిస్తాడు. ప్రభుసేవలో "వైభవముగా చేరుకొన్నాడట". ఆ సంఘు బాధ్యతను చూసి వెరవకుండ అదొక మహదవకాశంగా భావించి సేవలో అడుగుపెట్టాను అని చెప్పడం తనకున్న సేవాసక్తిని కనపరుస్తుంది. పర్లాకిమిడిలో పాస్టర్‌గా 38సంవత్సరాలు దివ్యమైన సేవచేసి చరిత్రను సృష్టించాడు. తన సేవను ఆ పట్టణానికే పరిమితం చేసుకొకుండా చుట్టుపక్కల గ్రామాలకు వర్తింపచేస్తూ రౌతుపురం, సియాలుటి, కింగ మొదలైన గ్రామలలో తానే స్వయంగా సంఘాలను స్థాపించాడు. ఫలితంగా కొండసీమల ప్రాంతంలో "ప్రాకె పరిశుద్ధ వాక్యంబు ప్రబలముగను, ఆంధ్ర పర్వత సీమల హద్దుదూరి". పాస్టర్‌గారు పనిచేసిన పర్లాకిమిడి ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దులో ఉన్న పట్టణం. చుట్టూ దట్టమైన అడవి, కొండలు. వాటి మధ్యగా ప్రవహించే నది. అందచందాలకు కొండసీమ ఆలవాలమైనా, సువార్తసేవకు ప్రయాణపు సౌకర్యాలు అనుకూలించేవి కావు. అయినా-పాస్టర్‌గారు నడుము కట్టి నిరాటంకంగా వాక్యాన్ని వ్యాపింపచేశారు.

సేవలో తన వంతు తాను సమర్ధనీయంగా నిర్వర్తించాడుగాని, తాను ఆశించిన ప్రోత్సాహం లభించలేదనిపిస్తుంది. సరిహద్దులో ఉన్న సంఘాలలో విభిన్న మనస్తత్వాలున్న సభ్యులుంటారు. ఆచారవ్యవహారాలే కాదు ఆలోచనా సరళిలో కూడా భిన్నత్వము కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అలాంటి వారి మధ్య పనిచేయడమంటే అంత సులువుగా సాగేది కాదు. ఆలాంటి సంఘాన్ని ఒక్క త్రాటిపై నడిపించాలంటే కత్తిమీద సాములాంటిది! ఈ పరిస్థితిని "సంఘాల దుస్థితి "అనే ఖండికలో నిర్మొహమాటంగా వివరించారు.

సీ॥ బైబిలునెపుడైన పట్టని వాడొకడు
తల్లిదండ్రుల దిట్టెడి దెష్టయొకడు
ఎన్నడు యారాధన నెరుగని మరియొకడు
చందాలు ఇవ్వని చవట యొకడు
పోకిరి మాటల పొగరెక్కువాడొకడు
రౌడీల గుంపుల రాయడొకడు
వీధుల తిరుగెడి వెంగల పింజొకడు
రోతమాటలాడు పోతుయొకడు

గీ॥ ప్రార్ధనన్నధి యెరుగని భత్తుడొకడు
చూడగలమయ్య వీరలను చోద్యముగను
సంఘబిజినెసు మీటింగు సభలలోన
నిండిపోదురు గుడినిండ దండిగాను

ఇది నిందాపరమైన ఆరోపనకాదు. అదుపు ఆజ్ఞలేకుండా క్రమము తప్పిన సంఘాల పట్ల పాస్టరుగారు వెలిబుచ్చిన ఆవేదన. ఈ పద్యం విన్నవాళ్లు తమ ప్రవర్తనను మార్చుకొన్నారో లేదో, దీన్ని అవమానంగా భావించి పాస్టర్‌గారి మీద తిరుగుబాటే చేశారో తెలియదు. గాని....... ఇంత ఘాటుగా ఏ పాస్టర్ తన ఆవేదన్ని అక్షరబద్ధము చెయ్యలేదు! అలా చేసివుంటే ఆ సంఘంలో పని చెయ్యడం అసాధ్యం. మరి వీరు ......... 38సంవత్సరాలు అక్కడే ఉన్నారంటె-వీరి ధైర్యసాహసాలకు జోహారు!! మరొకటి. ఇలా విమర్శించే పాస్టర్ నైతికంగా ఉన్నత స్థాయిలో ఉండాలి : ఆదర్శప్రాయుడై

ఉండాలి. అన్నిటికంటే ముఖ్యంగా దేవుని పట్ల ప్రగాఢ మైన భయభక్తులు, అచంచలమైన విశ్వాసం ఉండి తీరాలి. అప్పుడే అతని మాటకు విలువ అతనికి గౌరవం దక్కుతాయి. అంటే పాస్టర్ చౌధరి గారిలో ఈ సలక్షణాలు మూర్తీభవించాయన్న మాట. ఆయన సత్యసంధుడిగా జీవించాడన్న మాట. ఈ సద్గునాలు ధరాతలాలపై అభివ్యక్తి చెందుతూ ఉంటాయి. సుఖదుఃఖాల భావపరిదిలో ఆంతరికమైన సత్యము తనంతట తానే సమన్వితమై పోతుంది. ఈ అభివ్యక్తీకరణమే జీవనదృష్టికి గల దృశ్యవిధానం. ఎప్పుడో వంద సంవత్సరాల క్రితం దృష్టించిన సంఘజీవితంలో ఈ నాటికీ ఎలాంటి మార్పు లేకుండా ఉందంటే పాస్టర్‌గారి పలుకులు ప్రవచనాత్మకం.

ఈ అంశం క్రింద నాలుగే పద్యాలు ప్రచురితమయ్యాయి. ఇంకా కొన్ని పద్యాలు ఉండవచ్చుననిపిస్తుంది. బహుశా అవి లభ్యంకాలేదెమో.

మరో ఆరు పద్యాలలో "సువార్తికుని జీవితం"ను వివరించిన తీరును పరిశీలిస్తే ఆ పద్యాలను కూడా సంఘజీవిత లొసుగులకు జోడించవచ్చునని పిస్తుంది.

గీ॥ "పల్లెలరదేగి ప్రభుసేవ భాగ్యమనుచు
మూఢజనులకు సువార్త ముచ్చటించు
బోధకులు పొందుచుండెడి బాధలెవరు
తలపకున్నారు కాలంపు ధర్మమేమో"

ఇది ఐదు పద్యాలకు మకుటంగా వెలసింది. ఆ విధంగా తలిచేదెవరు

అని ప్రశ్నించుకొంటే సంఘం అని సమాధానమివ్వాల్సి వస్తుంది. సేవపట్ల, సువార్తపట్ల అంత నిర్లక్ష్యంగా సంఘాలు తయారయ్యాయని అర్థం. ఈ నాటికీ సంఘాలలో ఇదే దుస్థితి అలరారుతుంది. ఇది శోచనీయం

పాస్టర్ చౌధరీగారు కేవలం సంఘ క్షేమాభివృద్ధిని గురించే మనస్కరించకుండ సమాజ క్షేమాన్ని ఆకాంక్షించి సమసమాజాన్ని నిర్మించాలని ఆశించారు. అందుకు దోహదం చేసే పద్యాలను వ్రాశారు. అందులో ఒక్క పద్యాన్నైనా పేర్కొనపోతె ఈ అంశానికి న్యాయం చేకూరదు.

సీ॥ మతజాతి భేదములు మంట గలపకపోతే
శాంతి దేశము నెట్లు చక్కపరచు
ధనికులెల్లరు తమధనము పంచకపోతే
బీదరికమది యెటుల పారిపోవు
దేశభక్తులెల్ల దోపిడి చేస్తుంటే
దేశాభివృద్ధి యెటుల తేజరిల్లు
ప్రజలలో నైక్యత ప్రబలి యుండకపోతె
సమభావమెట్టుల సాగిపోవు

గీ॥ భాషభేదముల్ పట్టువదలి
వెర్రిభావంబులన్నియు వెనుకబెట్టి
ప్రేమమనసుతో ద్వేషాన్ని పారద్రోలి
పథమునందున నడిచెడి భాగ్యమెపుడో

ఈ ఒక్క పద్యముచాలు వారి మనోగతాన్ని అర్ధంచేసుకోడానికి.

"పుత్రశోకము" ఒక విలక్షణమైన ఖండిక! అందుకే దీన్ని గురించి ప్రత్యేకంగా నాలుగు మాటలు వ్రాయాలనిపించింది.

తాత్విక నేపథ్యాన్ని చూపెట్టే 37 పద్యాలు ఇందులో ఉన్నాయి. అవన్ని తేలికైన పదాలలో ఉన్నాయి గనుక ఒక్కసారి చదివితే ఇట్టే అర్ధమయిపోతాయి. చదివిన వెంటనే గోచరించే అర్ధము మనము ఉహించినట్లు ఉండదు. చేదు గుళికలు మింగినట్లు ఉంటుంది. పాస్టర్ చౌధరీ గారు దేవున్ని నిలదీసి, ఆయన చర్యను నిందిస్తూ నిర్మొహమాటంగా నేరారోపణ చేసేదేమిటా అని అనిపి స్తుంది.! ఇలా వ్రాసాడేమిటా అని విస్తుపోతాము. పాస్టర్ గారి మీద కోపము కూడా వస్తుంది. కాని ..........

రెండోసారి, మూడోసారి చదివినప్పుడు మామూలు మాటల వెనుక దాగిఉన్న తాత్విక చింతన కనిపిస్తుంది. అప్పుడు పాస్టర్ చౌధరీ గారి పట్ల జాలి కలుగుతుంది. ఆర్ధ్ర భావంతో హృదయం ద్రవీభూతమవుతుంది. అందుకే దీన్ని విలక్షణమైన ఖండిక అన్నారు.

కవిగారి మూడవ కుమారుడు స్టాన్లీ సంపత్ కుమార్ ఏడేళ్ల ప్రాయంలో వంశధార నదిలో అన్న, అక్కలు, మిత్రులతో కలిసి జలకాలాటలకు వెళ్లి ఆ నదిలో మునిగి కొట్టుకుపోయాడు. అకాల మరణానికి గురైన తన కుమారున్ని తలపోసుకుంటూ, బ్రద్దలైన తన హృదయావేదనను వ్యక్తం చేస్తూ, "........నీ యొక్క మరణవార్త గర్భమున చిచ్చుపెట్టెరా కన్నకొడుకా" అంటూ

వ్రాసిన విలాప గీతము ఇది.

అప్పుడే అవతరించిన సూర్యుడు ఎర్రబారి, పసిప్రాయములోనే కనుమరుగైన క్షణాన, రుధిర స్నాతమైన రక్తక్షరాల మాలగా కవి గుండెలను పిండి అక్షరబద్ధము చేసిన ఆక్రందన ఇది.

ఏ కష్టం కలిగినా, నష్టం వాటిల్లినా సంఘ సభ్యులు పాస్టర్ గారి దగ్గర తమ గోడు వెల్లబోసు కుంటారు. వ్యవస్థ మీద కోపం వచ్చినప్పుడు పాస్టర్‌ను ప్రశ్నిస్తారు. సంజాయిషీ అడుగుతారు. సమాధా నాలతో సంతృప్తి చెందకపోతే తిరగబడతారు : దూషిస్తారు, దౌర్జన్యానికి దిగుతారు. కిమ్మనకుండా భరించే వాడే సంఘ కాపరి. మరి..... ఆ సంఘ కాపరికే ఏదైనా విపత్తు కలిగినా, తన గుండెలవిసిపో యినా, అపారనష్టం వాటిల్లినా ఎవరిని అడగాలి? ఎవరిని ప్రశ్నించాలి? ఎవరిని నిలదీయాలి? ఎవరిని నిందించాలి? ఎవరి ముందు నిలిచి తన హృదయావేదనను వెలిబుచ్చాలి?

పుత్రశోకం – ఈ ప్రశ్నలకు జవాబుగా నిలుస్తుంది.

ఎంతటి మేటి పాస్టర్ అయినా మానవమాత్రుడే కదా! రాగద్వేషాలకు అతీతుడు కాలేడుగా? అందుకే ఈ శోకావళి. ఇటువంటి సంఘటనలు, పంతాలు, పట్టింపులు, అలగడాలు, కోపగించుకో వడాలు, బైబిల్ గ్రంథంలో అక్కడక్కడా కనిపిస్తాయి. అవన్నీ దేవునిపై వేసిన నెపాలే అవడం రవ్వంత విస్మయాన్ని కలుగజేస్తాయి.

దైవాదేశానుసారంగా ప్రవర్తించిన ఒక ప్రవక్తకు ప్రాణసంకటం

ఏర్పడిందట. ఆ సందర్భంలో దేవుని మీద అలిగి "......... యెహోవా, నా పితురలకంటే నేను ఎక్కువ వాడను కాను. ఇంత మట్టుకు చాలును, నా ప్రాణము తీసుకొనుము" అని ప్రార్ధన చేశాడు. (ఏలియా, 1 రాజులు 19:4) ఇదొక రకమైన నెపము. "అయ్యో! నీ మాట విన్నందుకు తగిన శాస్తి జరిగింది. ఇక నా వల్ల కాదు. నన్ను చంపేసేయి......" అని అర్ధించడమన్నమాట.

భక్తుడైన యోబు అనుభవము మన మనోభావాలకు మరింత చేరువ అవుతుంది. ప్రతి వాని జీవితంలో పరీక్షా కాలమంటూ ఒకటి ఉంటుంది. దైవము మీద భారం వేసి జీవితాన్ని గడపడం భక్తుని కర్తవ్యం. అంతేగాని కష్టం కలిగినప్పుడు, జీవితంలో అపశ్రుతులు దొర్లినప్పుడు దేవుడితో వ్యాజ్యమాడడం తగని పని. ఇందుకు భిన్నంగా పరమభక్తుడైన యోబు కూడా మానవ బలహీనతను ప్రదర్శిస్తూ...... ".......నా మనోవ్యాకులము కొలది నేను పలికెదను........నీవేల నాతో వ్యాజ్యమాడుచున్నావో నాకు తెలియజేయమని నేను దేవునితో చెప్పెదను......." అని తన నిశ్చయాన్ని ఎరుక పరిచి.......... ".......దౌర్జన్యము చేయుట నీకు సంతోషమా?" అని ప్రశ్నిస్తాడు. యోబు గ్రంథము 10వ అధ్యాయమంతా నిష్టూరాలే. ఇంకాస్త ముందుకు వెళితే ......... ".......... దేవునితో నే వాదింపగోరు చున్నాను" (13:3) అని వాదులాడుటకు సిద్ధమవుతాడు. "నీవేల నీ ముఖమును మరుగు చేసు కొంటివి?" (13:24) అని దేవున్ని నిలవేస్తాడు.

అయితే .......... అంతమాత్రాన యోబును మనము తూష్ణీభావంతో చూడనక్కర్లేదు. అతని బాధ సామాన్యమానవుని బాధ. అతని

అక్రందన మానవులంతా కష్టకాలంలో సర్వసాధారణంగా చేసే ఆక్రందన. గట్టిగా మాట్లాడితే మనం మనసులో దాచుకున్న భావాలను యోబు బహిర్గతం చేశాడు. మనము లోలోపల అనుకునే మాటలను యోబు బయటకు అనేశాడు.

మన అందరి ప్రతిరూపముగా యోబును, అతని జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ప్రతి ఒక్కరు జీవితంలో దేవుని ఉద్దేశ్యం ఏమిటో గ్రహించాలి. తదనుగుణ్యంగా నడుచుకోవాలి. యోబు ముందుగా అపార్థం చేసుకున్నప్పటికి, చివరకు .........“నీవు ఉద్దేశించినది ఏదియూ నిష్ఫలము కాలేదని నేనిప్పుడు తెలుసుకుంటిని” (42:2) అని వాస్తవాన్ని వెల్లడిస్తాడు. నాటకీయంగా పరిణమించిన యోబు జీవితము చరమదశకు చేరుకున్నప్పుడు ........ దేవునిపై ఆధారపడి జీవించిన విశ్వాసి తన శ్రమానుభవాన్ని అంతా కూడగట్టుకొని పలికిన మాటలు మరణవాంగ్మూలమనదగినవిగా ఉంటాయి. “అయితే నీ విమోచకుడు సజీవుడనియూ...... నా చర్మము చీకిపోయిన తర్వాత శరీరముతో నేను దేవుని చూతును” (19:25,26). వాస్తవానికి ఇది మరణవాంగ్మూలము కాదు : మరణశయ్య మీద కొట్టుమిట్టాడుతున్న వారికి నూతన ఆశను చిగురింపజేసే నిరీక్షణాస్పద వాంగ్మూలము!. యోబు దేవునితో ఎంతవాదులాడినా చివరకు దైవదర్శనము కలిగిన తర్వాత తన గత జీవిత బాధలన్ని మర్చిపోయి పునర్జీవం పొందిన వ్యక్తిలా వ్యవహరించాడు.

దావీదు తాను పడిన బాధను పలు రకాలుగా వెల్లడించాడు. “నీవు నాకు దుర్గమైన దేవుడవు. నన్ను త్రోసివేసితివేమి?” అని ప్రశ్నిస్తాడు. (కీర్తనలు 42:2)ఌ కీర్తన గ్రంథంలో ఇలాంటివి చాలా కనిపి స్తాయి. ఇలా ఎన్నైనా

చెప్పుకుపోవచ్చు.

జీవితంలో అప్పుడప్పుడు చోటుచేసుకునే పంతాలు, నెపాలు, దేవునిమీద వెలిబుచ్చే ఆగ్రహాలు, అలగడాలు. వ్యాజ్యభక్తిగా పరిగణనలోకి వస్తాయి. ఈ లక్షణాలు పాస్టర్ చౌధరీగారి "పుత్రశోకం"లో చోటుచేసుకోవడం ఆశ్చర్యమనిపించింది.

"నిష్ఠూరాలాడ నమ - కట్టిన : చేయనున్నది ఏమన్న చేసుకొనుము-". కుండబ్రద్దలు కొట్టినట్లు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చుతాడు....... భక్తుడైన యోబు మాదిరి! అంతటితో ఊర్కొనక పేతురు - నీటి మీద నడక, మునక సంఘటన పేర్కొంటూ - పేతురు నీట మునిగే సమయంలో...... "జాలి నొందుచూ కరమును - జాచినీవు చావులోనుండి తప్పించినావు గావే!" అని - "అట్టి నీ హస్తముల నెవడు - కట్టినాడు? మందగించిన నీ వీనులు - ఎందుకయ్యా? - నాదు బిడ్డదాపదలోన - నర చు వేళ తరలి రక్షింపకుంటివి - దైవమీవు". ఇది కర్తవ్యప్రబోధం చేసే పద్యం.! ఇంతకంటే ఘాటుగా విమర్శించిన పద్యము మరొకటుంది. నాయీను విధవరాలి కుమారున్ని బ్రతికించిన సంఘటన వల్లిస్తూ తన కుమారున్ని ఎందుకు బ్రతికించలేదు అని నిలదీస్తూ - "........ తనదు పుత్రుని బ్రతికింప - తరలినావు..., నాదు పుత్రుని రక్షింప - నాదరంబ, శక్తిహీనతో మరి నీ - చేతగాకో....." ఇది నిందా భరితం!. అట్లాగే లాజరును ఉదహరిస్తాడు. "పక్షపాతివిగాదకో - రక్షకుండ......" : "ఈర్ష్య కలిగెను నీకేల ఈశ్వరుండ" : ".......మొగ్గనక్కట తురుముట - ఎగ్గుగాదె" ".......ఏమి న్యాయమో

నీకిది – యెరుగకుంటి" : "........చేపకును ప్రతిగా పామునే – చేర్చినావు" ఈ పద్యాలలో తన అక్కసునంతా నిర్మోహమాటంగా వెలిబుచ్చాడు. కన్నకొడుకుపై తనకున్న మక్కువ, కడుపుతీపి మరణించిన విధానం తన గుండెల్ని తొలచివేస్తే, హృదయవ్యధకు గురైన పాస్టర్‌గారు ఎవరిని ఏమని అడగాలో తెలియక దేవుణ్ణే నిలవేసిన కథనం ఇది. యదార్ధమైన మానవనైజానికీ పద్యాలు అద్దం పడుతున్నాయి. కపటభక్తి ని ప్రదర్శించకుండా తన మనస్సులోని బాధను ఘాటుగా, సూటిగా వెల్లగ్రక్కిన చందం ఇది. అయితే – యోబులాగానే....... చివరకు : "వాదులాడితినని నాతో – ఖేదపడకు, కోపముంచకు నాపైన – తాపపడకు, కష్టమంతయు నీ తోడ స్పష్టపరచి, మన్ననలు కోరుచున్నాను – మరియ తనయా!" అంటూ తన కన్నీటిని తుడుచుకుంటాడు.

మానవ సహజస్వభావాన్ని, హావభావాలను ప్రదర్శించే ఈ పద్య సంపుటి ఉత్తమ సాహిత్యానికి చెందిన పద్యకావ్యం. దీన్ని వెలికితీసి పదిమందికి ఉపయోగకరంగా ఉంటుందనే ఆశతో అచ్చువేస్తున్న జేమ్స్ జయశీల్ చౌధరీ గారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. "పుత్రశోకం" లాంటి పద్యాలను నేనెక్కడా చూడలేదు. అంత ధైర్యముగా దైవముతో వాదులాడిన కవి గాని, కవిత్వం గాని నాకు కనిపించలేదు!.

పారమార్థిక ప్రస్థానంలో అడుగులు తడబడక మానవు. మితిమీరిన మాటలు నోటి వెంబడి వెలువడక మానవు. వాటిని కప్పిపుచ్చి, పైపైకి మంచి మాటలు పలికి, పరమభక్తునిగా నటించడం ఆత్మవంచనతో సమానం.

అలా కాకుండా – అసలైన సిసలైన మానవునిగా తన శోకాన్ని దేవుని ముందు నిర్భయముగా వెలిబుచ్చిన పాస్టర్‌గారు ఆదర్శప్రాయులు.

కవిసార్వభౌమ పురుషోత్తము చౌధరి గారి తదనంతరం సంప్రదాయబద్ధమైన కవిత్వాన్ని ఆశ్రయించిన వారు బాబు జాన్ చౌధరి గారొక్కరే తెలుసు. పాస్టర్ చౌధరీగారు ఇంతటి ప్రతిభ గల కవి అని ఎవ్వరికి తెలియదు. అలాంటి సమయంలో ఎక్కడో మరుగున పడిన ఈ కావ్యాన్ని ముద్రించి ఆ కవిని ఆంధ్రావనికి పరిచయం చెయ్యడం అభినందనీయం.

ఈ పద్యకావ్యములో 25 ఖండికలు ఉన్నాయి అవన్నీ అందరికీ ఉపయోగపడే పద్యరత్నాలు!

సరళమైన భాష, భావస్పష్టత ఉన్న పద్యాలు. సంస్కృత పదాలు పట్టుమని పదిశాతం కూడా లేవు . ఇది హర్షనీయం. యెవరు చదివినా అర్థమయ్యే సులభశైలి ఈ పద్యకావ్యానికి విశిష్టతను చేకూర్చింది.

అన్ని ఖండికల మీద వివరణాత్మకమైన సమీక్షచేయ్యాలంటే అదే ఒక పుస్తకమౌతుంది! ఒకటి రెండు ఖండికలమీద క్లుప్తంగా నా అభిప్రాయాలను వెలిబుచ్చే అవకాశం కల్పించిన జేమ్స్ చౌధరీగారికి నా ధన్యవాదాలు.

చివరగా –

ఈ సంకలనములో చేర్చిన ఖండికలు కొన్ని అసంపూర్తిగా ఉన్నాయనిపిస్తుంది. "క్రీస్తును గూర్చిన ఆలోచన "అనేది ద్విపదఖండిక.

అలాంటి సాహిత్య ప్రక్రియలను వీ రెన్నింటిని చేపట్టారో పరిశోధించాలి. ఆముద్రితంగా మిగిలిపోయిన సాహితీసంపదను సుసంపన్నం చేయాలి. అలా చేయడము అభినవ విక్రమాదిత్య జేమ్స్ జయశీలునుకే సాధ్యం !!

అలా చేస్తారన్న ఆశతో

చేస్తున్న ఈ కృషికి అభినందనలతో

దాన్‌బాబు

# స్వగతము - కృతజ్ఞతలు

ఈ పుస్తకమును ప్రచురించుటకు తన కృపను అనుగ్రహించిన పరమతండ్రికి మహిమాఘనతలు చెల్లును గాక!

మా త్రండిగారు, పాస్టరు పురుషోత్తమ చౌధరి, 38సంవత్సరములు సంఘ, వాక్య పరిచర్యలో శ్రమల స్వీయానుభవమును తన ఆత్మకథ ద్వారా తెలియపరిచినారు. మరియు పద్యకావ్యములో యేసు ప్రభువుచరిత్ర, మానవగుణగణాలు మొదలైన విషయములు సరళమైన తెలుగులో వర్ణించారు.

ఆయన జీవించియుండగా ఈ పుస్తకము ముద్రించి యుంటే చాలా సంతోషించి యుందురు. తన శత జయంతి (5-9-2006) సందర్భముగా ఈ పుస్తకమును ప్రచురించి విడుదల చేయుచున్నాము. మరియు అదేరోజున, మా తలిదండ్రుల జ్ఞాపకార్ధముగా నిర్మించిన బాప్టిష్టు దేవాలయము విజయగనరము జిల్లా జొన్నాడ గ్రామములో ప్రతిష్ఠించుచున్నాము. దేవుని సన్నిధిలో నున్న వారిరువురు మా యీ కార్యమును హర్షిస్తారని మా ఆశ. ఇందు ద్వారా దేవునికి మహిమ కలగాలని మా ఆకాంక్ష.

తన ఆత్మకథను సంఘకాపర్లనుద్దేశించి వ్రాశారు. కాని ఎవరైనా చదవదగిన పుస్తకమిది. ఈ పుస్తకమును చదువువారు ఒక ప్రాథమిక విషయము గమనించగలరు. క్రైస్తవుల ప్రవర్తన, సంఘముల పరిస్థితి ఎల్లప్పుడూ ఒక్కలాగే వుంటాయి. సాంకేతికముగా అభివృద్ధి చెందుచున్న

మానవుని జీవిత విధానములో ఏలాంటి మార్పులున్నప్పటికీ, యేసుక్రీస్తుని వెంబడించుటలో ప్రతీక్రైస్తవునిదీ తలోదారి. పండ్రెండుమంది శిష్యుల తీరూ అదే కదా!

ఈ పుస్తకమునకు " తొలి పలుకులు " వ్రాసిన రెవ. **డా॥ వై. జె. రోలెండ్,** పాష్టరు, కంటోన్మెంటు బాప్టిష్టు చర్చి, విజయనగరము, గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అడిగిన వెంటనే పద్యరచనలు విశ్లేషించి సమీక్షించిన రెవ. **డా॥ దాన్‌బాబుగారికి** నా ప్రత్యేక వందనములు మరియు కృతజ్ఞతలు.

ఈ పుస్తకమును ప్రచురించుటకు ప్రోత్సహించిన నా తోబుట్టువులకు, ఆర్థికముగా సహాయము చేసిన నా కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక వందనములు, కృతజ్ఞతలు.

సకాలములో ఈ పుస్తకమును ముద్రించిన **సిరి గ్రాఫిక్స్, గుడివాడ వారికి** నా కృతజ్ఞతలు

నల్లగొండ
20-8-2006

**జేమ్సు జయశీల్ చౌధరి**

# నా జీవిత చరిత్ర

(పాస్టర్ పురుషోత్తము చౌధరి, పర్లాకిమిడి)

దీని చదివినవారికి యిది సహాయపడునని అనుకొని నా జీవితములో జరిగిన కొన్నిముఖ్యసంగతులు వ్రాయుచున్నాను. ముఖ్యముగా పాష్ఠరులుగా పనిచేయువారికి సహాయపడునని నా అభిప్రాయము.

**<u>జన్మము:</u>** 1902 లో నా తండ్రి సాలూరులో లూథర్నుమిషనులో పనిచేయుటకు జర్మను మిషనెరీ షూల్జీదొరగారు పిలిచినందున వెళ్లియుంటిరి. ఈ దొరగారికి కుమ్మరివిల్లి మరియు ఇంకొక గ్రామము యందున్న భూముల అజమాయిషి, వ్రాతకోతలకు వారికవసరమున్నందున బాప్టిష్ఠ మిషనెరీవారికి భూములు విషయమై బాగా తెలిసినవారుంటె పంపమని కోరగా నా తండ్రిగార్ని పంపిరి. ఆ సమయంలోనే, బొబ్బిలిలో గడ్డాము శాయమ్మగారి ద్వితీయ కుమార్తె శాంతాబాయిని పెండ్లాడారు. లాండ్సుమేనేజర్ పదవిలో నాతండ్రిగారైన డానియల్ చౌధరిగార్ని, స్కూలు టీచరుగ నా తల్లి శాంతాబాయి చౌధరిని, షూల్జీదొరగారు నియమించిరి. నా తల్లిదండ్రులక్కడ ఉన్నప్పుడు వారికి ప్రధమసంతానముగా 1904లో ఆడపిల్ల జన్మించి రెండుమూడు నెలల్లో మృతిపొందెనట. తరువాత 05-09-1906 న నేను జన్మించితిని. నన్ను ప్రభువుసేవకు సమర్పించిరట. అప్పుడా మహాభక్తుడైన షూల్జీదొరగారు నన్ను తనచేతులతో ఎత్తుకొని ప్రార్ధించిరట. కొన్ని సంవత్సరములైన తరువాత నా తాతగారైన గోపినాధు చౌధరిగారు బహువృద్ధులైనందునను, గ్రామకరణముగా వారాకార్యము చేయశక్తి లేనందునను నాతండ్రిగారు షూల్జీదొరవారి యొద్దసెలవు తీసుకొని తన జన్మస్ధానమైన ఆకులతంపర గ్రామమునకు చేరుకొని తన తండ్రి స్ధానములో గ్రామకరణముగా పనిచేసుకొను చుండిరి. ఆ కాలమందు గ్రామమునసబు, కరణము ఉద్యోగములు

వంశపారంపర్యముగా ఉండేవి.

**<u>గ్రామము:</u>** ఆకులతంపరగ్రామము చుట్టుపట్లనున్న పల్లెటూర్లకంటె పెద్దది. ఆ గ్రామమునకు మంచి చరిత్ర కలదు. తాటిరాజు అనే తిరుగుబాటుదారుని గవర్నమెంటుకు పట్టియిచ్చినందున జోగిరాజు, ఫకీర్‌రాజులకు ఆ గ్రామము మొఖాసాగా బహూకరించిరి. ఈ చరిత్ర రసూల్ దొరగారి రికార్డులో నేటికీ వున్నది. గ్రామము చుట్టూ. మామిడితోటలు, చింతచెట్లు విస్తారముగ వున్నందున దూరమునుండి చూచువారికి గ్రామము కనిపించేదికాదు. అంత దట్టముగా తోటలుండెడివి. వంశధారనది ఒడ్డునే ఆ గ్రామముండెడిది. ఆ గ్రామములో ఒక ప్రాథమిక పాఠశాలుండెడిది. నాతల్లిగారు ఆ గ్రామస్కూలుకు హెడ్‌మాస్టరుగా ఉండేవారు. ఆ స్కూలులో నాల్గవ తరగతి వరకు ఉండెడిది. ఆ కారణమున చుట్టుపట్లవున్న గ్రామములనుండి విద్యార్థులు ఆ స్కూల్లో చదువుకొనేవారు. ఆ రోజులలో నాల్గవతరగతి పాస్ అయినవారు టీచరుగా ట్రైనింగుపొందుటకు అర్హులు. అందువలన ఆ స్కూలునకు మంచి పేరు, ప్రాముఖ్యత ఉండేది. నాల్గవతరగతిలో ఉత్తీర్ణులైనవారు శ్రీకాకుళంలో ట్రైనింగుస్కూలులో తర్ఫీదు పొంది గ్రామాదులందు ఉపాధ్యాయులుగ పనిచేసుకొనేవారు. నా తండ్రిగారు గ్రామకరణము గావున కుటుంబ స్థితి దర్జాగావుండేది.

**<u>మా చదువులు:</u>** నాకొక తమ్ముడు, ఒకచెల్లెలు వుంటిరి. రాజమోహన్, లలితాబాయి. నా తమ్ముడు, నేను కాకినాడలో మెక్లారిన్ హైస్కూలు నందు చదువుటకు వెళ్ళి మొదటి ఫార్మ్‌లో (ఆరోతరగతి) ప్రవేశించినాము. కారణమేమంటె నా పెదతండ్రి జాన్ చౌధరిగారు, కాకినాడలో క్రైస్తవ పత్రిక "రవి" కి ఎడిటరుగా యుండెను. గనుక వారి ఇంట్లో వుంటిమి, ఆరోజులలో ఫారములనేవారు, యీదినములలో క్లాసులంటున్నారు, కాకినాడలో మేము

నాల్గవ ఫారము వరకు చదువుకొని పర్లాకిమిడిలో మహారాజు గారి హైస్కూలులో తిరిగి నాల్గవ ఫారములో ప్రవేశించి స్కూల్ ఫైనల్ వరకు చదువుకొంటిమి, నేను స్కూలుఫైనలు ఫేలైనందున రైల్వేడిపార్టుమెంటులో ఉద్యోగమునకై అభిప్రాయము నాలో వుండెను. నా తల్లిదండ్రులు అనేకసార్లు మేము నిన్ను ప్రభువు సేవకై సమర్పించినామని చెప్పుచుండెడివారు. కాని నాకు ఆ మాటలు వినుటకు ఇష్టముండేది కాదు. తల్లిదండ్రుల మాటలు నిరాకరించినాను.

**నాగూర్చిన దైవసంకల్పము:** 1928 సం॥ మా చిన్నాన్న, అనగా మాతల్లి చెల్లెలిభర్త కలకత్తానుండి మమ్మును చూచుటకు తన కుటుంబముతో వచ్చియుండెను. ఆయన అచ్చట రైల్వేలో వార్డు మేష్టరుగా యుండెను. అతను నన్ను రైల్వేలో పనియిప్పించెదనని చెప్పినందుననూ, నేను దైవసేవచేయనని పట్టుదలగలిగి యున్నందుననూ, నా తల్లిదండ్రులు నన్ను వారితో కలకత్తాకు పంపుటకు ఇష్టము లేకున్ననూ, నన్ను పంపిరి. కలకత్తాలో 1 1/2 సం॥ లుంటిని.

**కలకత్తా జీవితము:** ఆ రోజులలో రైలుబండ్ల డిపార్టుమెంటు మూడు కంపెనీల వలన నడుపబడుచుండెను.

1. బి.ఎన్.ఆర్. బెంగాల్ నాగపూర్ రైల్వే కంపెని.
2. యం.ఎస్. యం. మెడ్రాసు సదరన్ మహారాష్ట్రా కంపెనీ.
3. ఇ.ఐ.ఆర్. యీస్టు ఇండియన్ రైల్వే కంపెనీ.

పై మూడు కంపెనీలు ఇంగ్లాండులో ఉండి, వారి ఏజెంట్లు ఇక్కడ పనిచేయుచుండెడివారు. వారి చేతిక్రింద పెద్ద పెద్ద ఆఫీసులుండెడివి. వారే ఉద్యోగములిచ్చెడివారు.

బి.ఎన్.ఆర్. కంపెనీ కలకత్తాలో కిడ్దర్‌పూర్‌లో యుండెను. నా చిన్నాన్నగారు (ఆయనపేరు డేవిడ్ స్మిత్), కలకత్తావెళ్ళి వారు ఆంగ్లోఇండియన్‌గా రెజిష్టరు చేయించుకొని పనిలో ప్రవేశించిరి. గనుక హౌరానగరములో "బామన్‌గాచి" అనే స్థలములో ఆంగ్లోఇండియన్ కోలనీలో యుండిరి. నేనుకూడ వారివలె వేషము వేసుకొని ఆంగ్లోఇండియన్‌గా మారిపోతిని. ఒకదినము, హౌరాలోని బామన్‌గాచి నుండి బి.ఎన్.ఆర్. కంపెనీ ఆఫీసుకు నా చిన్నాన్నగారు నన్ను తీసుకొని వెళ్ళిరి. ట్రాములలో ప్రయాణము. చాలా దూరము. హౌరానుండి హుగ్లీనది దాటి కలకత్తా వెళ్లవలెను. ఉదయము 6 గం॥ లకు బయలుదేరిన మేము సుమారు పది గంటలకు ఆఫీసుకు చేరుకొంటిమి. ఎవ్వరు ఉద్యోగము ఇత్తురో ఆ డిపార్ట్‌మెంటుకు వెళ్లి ఆ ఆఫీసరుగారిని కలుసుకొని మాట్లాడగ ఆయన పని ఇస్తానని ఒప్పుకొనిరి. ఒక దినము నిర్ణయించి ఆ దినమునకు రమ్మని కోరగా, సరేయని తిరిగి ప్రయాణముచేసి సాయంకాలము 6 గం॥ లకు ఇల్లు చేరుకుంటిమి. ఆ అధికారి రమ్మన్న దినమునకు మూడు దినములకు ముందుగా నాకు కొంచెము ఉష్ణము వచ్చినది. రెండోదినమునకది హెచ్చినది. నా మనసులో ఆఫీసుకు వెళ్ళలేననే సంశయము కలిగినది. మూడోదినము ఉదయము 5గం॥ లకు ఒంటేలుకు వెళ్తానంటే నాదగ్గర పండుకొనియున్న నా పిన్ని నన్ను బాత్రూములోకి తీసుకొనివెళ్ళి తలుపు కొంచెము చేరవేసి పైన నిలుచున్నది. అందులో నేను నిలబడినపాటున పడిపోతిని. నా తలకు బాత్రూములో ఉన్న రైల్వే ఇటుకతగిలి రక్తము కారినదట, నాకు స్పృహలేదు. నా చిన్నాయనకు ఫోను చేస్తే ఆఫీసునుండి వచ్చి టాక్సీమీద నన్ను మెడికల్ కాలేజి ఆస్పత్రికి తీసుకువెళ్లి జాయిన్ చేసిరట. నాకు తెలియదు.

**ఆసుపత్రి అనుభవము:** మూడవ దినము స్పృహ వచ్చినది. కన్ను తెరచి

చూడగా నాకు ఆశ్చర్యము, భయము, కలిగెను. నా ప్రక్కనే నా పినతండ్రిగారి చిన్నాన్నగారి కుమారుడు మంచముమీద కూర్చొని ఉండి నన్నుచూసి "ఆల్బర్ట్! ఇప్పుడు నీవు ఆసుపత్రిలో ఉన్నావు" అని చెప్పగానే భయం వేసినది. నేనెప్పుడు అంతపెద్దహాలు, అందులో అన్నిమంచములు, అంతమంది నర్సులను చూడలేదు. నాకది ఒక క్రొత్త ప్రపంచమువలె కనిపించినది. ఆ వార్డులో అందరూ ఆంగ్లోఇండియనులు. నర్సులు కూడా వారే. నేను ఒక నర్సును మేడమ్ అని పిలిచినాను. ఆమె ఆశ్చర్యపడి నావైపు చూచినది. తరువాత నేను పల్లెటూరి వాడనను కొన్నదేమో!. నా రోగము డబుల్‌న్యుమోనియా, టైఫాయిడ్అని గ్రహించి, నర్సు సీటు దగ్గరగా వున్న మంచముమీద వేసినారు. ఆ నర్సుకు తెలుగు వచ్చును. తనది వైజాగ్ అని చెప్పినది, చాలా లంచగొండి. మా పిన్నమ్మను కార్జముకూర తెమ్మని కోరేది. ఆమె పేరు టిల్లెట్టు. తుదకు ఈమే నన్ను బాధించేమనిషిగా తయారైనది. అది మెడికల్ కాలేజి హాస్పటల్. ఆ దినములో విద్యార్థులు వార్డులలోనికి వచ్చి నర్సులకు సొమ్ము కట్టి తమకు కావలసిన రక్తము రోగుల నుండి తీసుకొని, పరీక్షించి ఆ రక్తమునకు సంబంధించిన సబ్జక్ట్స్ చదువుకొనేవారు. ముఖ్యముగ టైఫాయిడ్ రోగుల రక్తమునకై వచ్చేవారు. నారక్తము ఆ నర్సు అమ్ముకొనేది. యీ సంగతి మా చిన్నాన్నకుగాని, పిన్నమ్మకుగాని తెలియదు. అందువలన నాకున్న రోగము ఎప్పుడూ ఒక్కవిధముగా ఉండడమే కాకుండ బహుదినములు ఆస్పత్రిలో ఉండవలసి వచ్చినది. సుమారు రెండు నెలలు ఆస్పత్రిలో వున్నాను. నా తల్లిదండ్రులు నన్ను చూచుటకు మాఊరినుండి వచ్చినారు. నాతల్లి నన్నుచూచి బహుగా చింతించి, నాయినా నిన్ను దైవసేవకర్పించినాము, నీవు మా మాట వినలేదు, ఇప్పుడెంత నష్టము కలిగినదని కంటనీరుపెట్టినది. అమ్మా! నేను బాగైతే ప్రభువుసేవ చేస్తానని వాగ్దానము చేసినాను. నాతల్లిదండ్రులు సంతోషించినారు. అప్పటికి నేను శల్యములుగా నుంటిని. నన్ను చూచిన

వారు, అస్థిపంజరమను కొనేవారు, నేను బ్రతుకుతాననే నమ్మకము ఎవ్వరికి లేదు. నాతల్లి, అన్నదమ్ములు కలకత్తాలో నా పిన్నమ్మయింట్లో వున్నారు. నా తండ్రిగారు తిరిగి మావూరు వెళ్లిపోయినారు. నా తల్లి, నాతమ్ముడు అనుదినము సాయంకాలము నన్ను చూచుటకు 4 గం॥ లకు వచ్చి 6 గం॥ లకు వెళ్లిపోయేవారు. నేనున్న వార్డు మేజర్ డే చూచేవాడు. అస్థిపంజరమువలె నున్న నన్ను బాధపెట్టి, విద్యార్థులు నా రక్తము తీసుకొనేవారు. ఒక దినము డే గార్కి ఈమాట చెప్పినాను. వెంటనే నర్సు టిల్లెట్టు ఐసు సంచి నామీదపెట్టి డెలిరియమ్ అనేది. ఒకరోజు యీసంగతి నన్ను చూచుటకు వచ్చిన నా చిన్నాయనతో చెప్పినాను. ఆ సాయంకాలమే ఆయన జరిగిన విషయము నేను తనతో చెప్పినట్లు డేగారికి చెప్పగానే మరునాడు ఆ నర్సును మరియొక వార్డుకు బదిలీచేసి, మెడికల్ విద్యార్థులు వార్డులోనికి రాకూడదని ఆజ్ఞాపించి ప్రత్యేకముగా, ఒక హౌసుసర్జనును, వారమున కొకమారు రక్తము తీయుటకు నియమించినారు. నావలన చాలామంది రోగులకు మేలు కలిగినది, ఆనెలలో నేను బలముపొంది నడువగలిగాను, నేను ఆస్పత్రిలో ప్రవేశించిన దినమునుండి 3 నెలల 15 రోజులు తరువాత, అనగా, నా తల్లి, తమ్ముడు వున్న నెలపదిహేను దినములలో ఆస్పత్రినుండి పంపివేసినారు. ఇంటికి వచ్చినప్పుడు మా గ్రామస్తులు ప్రక్కగ్రామస్తులు చాలా మంది అనుదినము నన్ను చూచుటకు వచ్చి "ఉన్నది చాలకా!" రైల్వే ఉద్యోగమునకు వెళ్లినావని అనేవారు. ఈ రీతిగా దేవుడు తనసేవకు నన్ను పిలిచినాడు.

**<u>నాపై నింద:</u>** నేను సెమినరీ చదువుటకు కాకినాడ వెళ్ళకముందు జరిగిన సంఘటన. మా తల్లిగారు తరచుగా రోగముతో బాధపడుచుండెను, ఆమె మంచమెక్కినప్పుడు, కొందరు క్రైస్తవ బాలికలు ఇంటివచ్చి వంటచేసేవారు. వారికి మూడుపూటల భోజనము పెట్టేవారము. ఒకసారి ప్రక్కఊరినుండి

ఒక క్రైస్తవ బాలిక మా ఇంటికివచ్చి పదిరోజులు వంటపని చేసింది. ఆ తరవాత తన ఊరికి వెళ్లిపోయినది. ఆమె ఊరికి వెళ్ళిన తరవాత నెల 15 రోజులకు ఆమె గర్భవతి అని ఊరంతా తెలిసినది. దానికి కారణము ఎవరో ఊరందరికి తెలుసు. మాయింట ఒక బోధకుడు తరుచుగా భోజనము చేసేవాడు. నాతో స్నేహముగా ఉండేవాడు. కాని తన మనస్సులో నాపై ద్వేషభావము ఉండేది. ఈ బోధకుడు, ఒకరోజు, ఆ ఊరునుండి ఒక క్రైస్తవుని వెంటబెట్టుకొని మాయింటికి వచ్చినాడు. ఆ క్రైస్తవుడు నా తల్లిదండ్రులతో ఆ పిల్ల గర్భమునకు కారణము మీ అబ్బాయే అని చెప్పగా నా తల్లిదండ్రులు బ్రాన్పడిపోయిరి. ఆ క్రైస్తవుడిపై నాకు విపరీతమైన కోపం వచ్చి గట్టిగా ఒక లెంపకాయ కొట్టితిని. వెంటనే ఆ బోధకుడు, ఆ క్రైస్తవుని తీసుకొని ఫీల్డ్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గారైన నాయుడుగారి వద్ధకు వెళ్ళి నాపై పిర్యాదు చేసిరి. నాయుడుగారు మా యింటికి వచ్చి "నీవు చేసినపని తప్పుకాదా?" అని నన్ను నిలదీసాడు. "నిర్దోషిని అయిన నా మీద నిందమోపడము తప్పుకాదా?" అని ఎదురు ప్రశ్నవేసితిని. "నా తప్పు ఋజువు చేయండి, నా ప్రవర్తన మీకు తెలియదా" అని గట్టిగా ప్రశ్నించితిని. తరువాత ఆయన వెళ్ళిపోయినాడు. మూడుదినములు అయిన తరువాత నాతో దెబ్బతిన్న క్రైస్తవుడే "ఆ కుర్రవాడు అటువంటివాడు కాడు. మీ ప్రోత్సాహం వలనే ఆ నిందవేసి అనవసరముగా నేను దెబ్బతిన్నాను" అని ప్రెసిడెంటుగారితో అనగానే ఆయన నోరుమూసుకున్నాడు. సైతాను మనలను చిక్కులు పెట్టినప్పుడు సరియైన జవాబు మనము ఇవ్వవలెను. "దెబ్బకు దయ్యము జడుస్తుంది" అనే నానుడి ఎంత సత్యమైనది.

<u>**సెమినరీ చదువు - కాకినాడ జీవితం:**</u> మిషనరీ వారు నన్ను థియాలజీ స్కూలునకు కాకినాడకు పంపుటకు ఏర్పాట్లు చేసిరి. 1931 జులై నెలలో

నేను జగన్నాయకపూర్ సెమినరీస్కూల్లో ప్రవేశించి మూడు సం॥ లు తర్ఫీదు పొందినాను. ఆరోజుల్లో విద్యుత్ లేదు హరికేన్ దీపాల వెలుగులో రాత్రి చదువుకునేవారము. నాతోపాటు చదువుకున్న కొందరి పేర్లు ఈ దిగువున పేర్కొంటున్నాను.

1. ఎ.బి. జాన్ మతూశెల
2. ఎ.ఎల్. సుదర్శనరావు (తుని)
3. జాన్ సుదర్శనం (అవనిగడ్డ)
4. పి. వీరాచారి (తుని)
5. డోకిబుఱ్ఱ వీరాస్వామి (కాకినాడ)
6. కె.పి. ఇశ్రాయేలు (రామచంద్రాపురం)
7. శీలం ఐజక్ (పిఠాపురం)
8. పురుషోత్తమ చౌధరి (ఆకులతంపర) (నేను)

మా ఉపాధ్యాయులు - రెవ జె.బి. మెక్లారిన్, రెవ సి.హెచ్. భానుమూర్తి, శ్రీ ముత్యాల తియాఫిలస్, పాస్టర్ ప్రేమానందము.

**<u>తల్లి మరణము:</u>** . నేను కాకినాడ వెళ్లిన రెండవ సం॥ లో నా ప్రియమైన తల్లి జబ్బుపడినది. తన రోగము తీవ్రమైనందున రెవ. యస్.సి.ఫ్రీమన్ దొరగారు నన్ను పంపమని టెలిగ్రాము మాహెడ్మాష్టరుగార్కి పంపిరి. వెంటనే నేను పర్లాకిమిడి వచ్చి అక్కడ నుండి నా స్వగ్రామము ఆకులతంపర వచ్చినాను. నాతల్లి స్పృహతప్పియుండెను. ఆమె మంచము దగ్గర క్రిందకూర్చొని బైబిల్ చదువుచుంటిని. తనపెదవులు కదులుట, హీనస్వరము తన నోటినుండి వచ్చుట చూచి నా చెవులు తన నోటిదగ్గరకు పెట్టితిని. "ప్రభువా నా భర్తను, బిడ్డలను కాపాడమని" ఎన్నోసార్లు ప్రార్థించుచుండెను. ఆహా! తల్లిప్రేమ ఎంత గొప్పదో! పదియాజ్ఞలలో మొదటివి దేవుని యెడల

మానవుని విధులు, రెండోవి  తన తల్లిదండ్రుల యెడల మానవులు చూపవలసిన విధులు. "తల్లికంటెను వేరుదైవంబు గలదే" యని ఒక కవి అంటాడు. చావుతో పోరాడుచున్న సమయములో కూడ తన ప్రార్థన పిల్లలగూర్చి. ఎంత గొప్పప్రేమ! తల్లిప్రేమ ! తనమంచము దగ్గరకూర్చొని బైబిలు చదివి ప్రార్థించే వాడను. ఒక వారములో తను ప్రభువు దగ్గరకు చేరుకొన్నది. రెవ.యస్.సి.ఫ్రీమన్ దొరగారు, రెవ కె.యం. జేమ్సు అప్పన్న గారు సమాధి జరిగించిరి. గ్రామస్తులందరు సమాధిక్రియకు హాజరైరి. గ్రామాధికారి (గ్రామము తనదే) లావణ్యవతిజమ్మా మమ్మును 15 దినములు ఆదరించిరి. తన కుమారుడు పద్మనాభరాజు మమ్మునోదార్చుటకు ప్రతీదినము మాయొద్దనే వుండి, మా విచారమునుండి తప్పించుటకు ఎన్నో సంగతులు చెప్పుచుండెడివాడు. నేను సెమినరీలో ప్రవేశించిన రెండొవ సంవత్సరము నాతల్లి వెళ్లిపోయినారు, మరువరాని సంఘటన. సెమినరీ ముగించి యింటికి వచ్చినప్పట్టికి ఇంటితలుపులు మూసియుండెను. నా తండ్రిసువార్త చెప్పుటకు దరిగ్రామాలకు వెళ్లియుండెను. నాతమ్ముడు ట్రైనింగుకై శ్రీకాకుళం వెళ్లియుండెను. ఇంటితలుపులు వేసి యుండుట చూచి ఏకధారగా కన్నీళ్లు కార్చితిని. నవ్వుచూ నన్నాహ్వానించే తల్లి లేదే!

<u>**నిరుద్యోగ పర్వము:**</u> ఆరోజులలో అనగా 1934 సం॥లో ఫీల్డు కౌన్సిలు ప్రసిడెంటుగా బి.జి.నాయుడుగారు, లేఖికునిగా పి. అప్పలస్వామి నాయుడుగారు, ఖజనాదారుగా రెవ. యస్.సి. ఫ్రీమన్ మిషనెరీగారు ఉంటిరి. అయిదు లేక ఆరుగురు మెంబర్లు యుంటిరి. లేఖికుడుగారు నాల్గవ ఫారము పేసై రామాయపట్నంలో సెమినరీ పూర్తిచేసి హీరమండలమనే గ్రామములో బోధకునిగా వుండెను. ఒకదినము ఖజానా దారునిగా ఉన్న మిషనరీగారు - చౌధరి సెమినరి ముగించి కాకినాడ నుండి వస్తున్నారు. ఆయనను

శ్రీముఖలింగమనే గ్రామములో బోధకునిగా వేస్తానని చెప్పగా, మేము జీతములు ఎక్కువ చేయమని కోరగ సొమ్ములేదని అంటివి. ఇతనికి జీతమిచ్చుటకు సొమ్మెక్కడనుండి వచ్చినదని ప్రశ్నించగా, డబ్బు విషయమై మాట్లాడుటకు మీకు అధికారము లేదని మిషనెరీ వారు చెప్పిరి. వెంటనే ప్రసిడెంటుగానున్న నాయుడుగారు ఫీల్డు కౌన్సిలు క్యాన్సిల్ చేస్తున్నానిచెప్పగానే, దానిని సెక్రటెరీగారు రికార్డు చేసి ఫీల్డు కౌన్సిలును ముగించిరి. ఈ వార్త విన్న నాకు చాలా నిస్పృహకలిగినది. అదే సంవత్సరము నాతమ్ముడు శ్రీకాకుళంనకు హయ్యరు గ్రేడు టీచరు ట్రైనింగుకై వెళ్లెను. గనుక స్కూలులో టీచరుగా రెండు సంవత్సరములు పనిచేస్తిని.

స్కూలు భారము వహించి నమ్మకముగ పనిచేయుచుంటిని, రాత్రివేళ కూడా పిల్లలను చేర్చి పాఠములు చెప్పుచుంటిని. స్కూలు ఇన్స్పెక్టరు యీసంగతి విని ఒక దినము సాయంకాలము ఏడు గంటలకు వచ్చి చూచిరి. తనలో నాయెడల పరిపూర్ణమైన విశ్వాసము కలిగెను. ఆ సం॥ తాలూకాలో వున్న గ్రాంటు స్కూళ్లన్నిటికంటే నాస్కూలునకు అధికము గ్రాంటు వచ్చినది. దేవుడు సమస్తము మన మేలునకై చేయునన్న వాక్యము యొక్క అనుభవము, నాజీవితములో జరిగినది. ఆ గ్రాంటుతో లేండు మోర్టగేజి బ్యాంకులో, మా తండ్రిగారి ఋణము సంపూర్ణముగ తీర్చగలిగితిమి. నేను ఉద్యోగములో వుంటె తీర్చలేకపోయియుందుము. "ఆయన చిత్తమే జరుగునుగాక".

**<u>వివాహము:</u>** నాకు ఉద్యోగములేనప్పటికి 1937 మార్చి 9 తారీఖున నా వివాహము పర్లాకిమిడి బాప్టిష్టు ఆలయములో పాస్టరు కళిమహాంతి జేమ్సు అప్పన్న గారి రెండవకుమార్తె-ఇమోజిన్‌తో జరిగినది. బరంపురము నుండి బంధుమిత్రులు వచ్చిరి. ఆ బాప్టిష్టు సంఘ పాష్టరుగారు ఒనామొచెంద్రొ గారు, వివాహము జరిగించిరి. 1941 సం॥ డిశంబరు వరకు నాకు

ఉద్యోగము లేకుండెను. ఈలోగ నాకు ముగ్గురు బిడ్డలు కలిగిరి. ప్రధమకుమారుడు సామ్యేలు శాంతికుమార్, రెండోసంతానము ఆడపిల్ల. పేరు హిల్డాశశి కుమారి. మూడవ సంతానము మగబిడ్డ. పేరు దేవిడ్ దేవదాసు.

నా మూడవ సంతానము తరువాత నా మామగారు సన్నిపాతము వలన మృతిచెందిరి. ఆయన పర్లాకిమిడి బాప్టిష్టు సంఘ పాష్టరుగా 30 సం॥ పనిచేసి యుండిరి. పర్లాకిమిడికి సుమారు 2 సం॥లు పాష్టరు లేకుండా సంఘము సభ్యులతో నడుపబడుచుండెను. తమ సంఘమునకు పాష్టరు కావలెనని "రవి" వారపత్రికలో ప్రచురించిరి. ఇద్దరు ధరఖాస్తులు పంపిరి. వారిని పిలిపించి వారి ప్రసంగములు విని సంఘస్తులు యిష్టపడనందున వారిని పనిలోనికి తీసుకొనలేదు.

**<u>పర్లాకిమిడి సంఘము - పాష్టరు ఉద్యోగము:</u>** అప్పుడు వారికి నేను జ్ఞాపకంవచ్చితిని. మనమధ్యనున్న యౌవనస్తుని మనమెందుకు పాష్టరుగా ఎన్నుకొనకూడదని సంఘము ఆలోచించి, నాయొద్దకు, సంఘముందున్న ముఖ్యసభ్యురాలైన పి.పుష్పలలనమ్మను పంపిరి. నాగ్రామము 9 మైళ్ల దూరమందున్నందున, ఆమె జట్కా కట్టించుకొని మా ఊరికి వచ్చి నాతో సంప్రదించిరి. అప్పుడు నేనామెతో యీదిగువ విధముగ సంభాషించితిని. "ఆంటీ! నేను సువార్తికునిగా వుండవలెనని నిశ్చయించుకొంటిని. ఆ ప్రకారము జరిగించుట నాకిష్టము. పాష్టరుగా వెళ్లుటకు నాకిష్టము లేదు" అని చెప్పితిని. ఆమె నిస్పృహతో వెళ్లిపోయిరి. వారము దినములైన తరువాత తిరిగి ఆమెగారే వచ్చి, కొంచెము ప్రోత్సహించి మాట్లాడిరి. నేను మొదట యిచ్చిన జవాబునే యిచ్చితిని. అప్పుడు సంఘస్తులు మిషనరీ వారైన రెవ. యస్.సి.ఫ్రీమన్ దొరగారిని పంపిరి. ఆయనతో యీదిగువ విధముగా నా

అభిప్రాయము వెళ్ళబుచ్చితిని. "ఇది స్వపోషణ సంఘము. వారికి ఇష్టము లేనప్పుడు నన్ను తీసివేయగలరు. అప్పుడు నా గతి ఏమి? నన్ను శ్రీముఖలింగములో బోధకునిగా పంపెదనని మీరే అంటిరిగాన, నేను బోధకునిగా వుంటానని" చెప్పితిని. "సరే, మీరు బాగా ఆలోచించండని" చెప్పి" వెళ్లిపోయిరి. పర్లాకిమిడి సంఘస్తులు ఏకగ్రీవముగా పట్టుదలతో మిషనెరీ వారితో మాట్లాడి నాయొద్దకు మరల ఆయనను పంపిరి. యీసారి ఆయన యీరీతిగా మాట్లాడెను. "నిన్నుపిలుచుటకు వచ్చిన సంఘ సభ్యురాలు, మీ కుటుంబ విరోధి, ఆమె పట్టుదల కలిగియున్నారు. నిన్ను పాష్టరుగా పిలుచుచున్నారు", అని చెప్పి రెండు చేతులెత్తి ప్రార్థించి, వెళ్లిపోయిరి. నేను నా తండ్రితో ఈ విషయము చెప్పగా, ఆయన(ఫ్రీమన్ దొరగారు) దైవభక్తుడు గనుక ఆయన ఉద్దేశమును అంగీకరించుమని చెప్పిరి. తిరిగి ఆ అమ్మగారు వచ్చినప్పుడు నేను సమ్మతించి పాష్టరుగా పర్లాకిమిడి వెళ్ళితిని. నాకొక అధైర్యముండెను. వీరి మధ్య నేను పుట్టి పెరిగి యుంటిని. నా బాల్యము వీరు ఎరుగుదురు. వీరు నన్ను గౌరవింతురా యన్న భావముండెను. గాని, దానికి వ్యతిరేకముగనే అంతయు జరిగినది. ప్రతి క్రైస్తవ కుటుంబము నన్ను గౌరవించినది.

1941 డిసెంబరులో నేను సంఘపాస్టరునై, నామొదటి క్రిస్మసు పండుగ పర్లాకిమిడిలోనే జరిగించుకొంటిని. ఐదు సంవత్సరములు నెమ్మదిగా గడిచినవి, నేను వెళ్లిన 6 సం॥ లో ఒక వివాహము జరిగించవలసివచ్చినది, ఆ వివాహము జరిగించకూడదని నన్ను పాష్టరుగా పిలిచిన అమ్మగారు పట్టు పట్టిరి. గానీ నేను ఆ పెండ్లి జరిగించితిని.కారణం పెండ్లి కొడుకు - మా సెమినెరీ హెడ్‌మాస్టర్ గారి కుమారుడు. ఆమె ఆ దినము నుండి నాయెడల కఠినముగా యుండి ఒక విషయములో నన్ను జైలుచేయించ ప్రయత్నించినది.

మహాసభలో నన్ను అవమానపరచుటకు ప్రయత్నించినది, నా ప్రసంగములు వినుటకిష్టపడేది కాదు, నాకు విరోధముగ అన్ని పరిస్థితులలో నిలిచేది. సంఘస్తులు యీసంగతి గ్రహించి ఆశ్చర్యపడుటయే గాక, సంఘమందు ఆమె కుంటుంబముతప్ప, తక్కిన వారంతా నా పక్షముగ నిలిచి పోరాడిరి. సుమారు 12 సం॥ లు ఆమె నన్ను తరిమినది. కాని నేటికీ ఆమెను నాతల్లిగా భావించుచున్నాను.

**శ్రమలు – దేవుని సహాయములు:** నా పెద్దకుమార్తె టైఫాయిడు జ్వరముతో బాధపడుచున్నది. సంఘము అల్లకల్లోలముగాయున్నది. రాత్రనక, పగలనక, దివారాత్రములు ప్రార్ధనలలో గడుపుచున్నాను. నాశరీరమునందు భయంకరమైన దురదలు. ఇట్టితరుణములో టెక్కలినుండి మిస్ పాస్కల్ అనే లేడి మిషనరీ పర్లాకిమిడి పొలమునకు బదిలీయైవచ్చినది. ఆమె నా పిల్లలను బహుగా ప్రేమించేది. పైన పేర్కొన్న స్త్రీ కి అసూయ కలిగినది గనుక, ఆమె ప్రేమను చెడగొట్టుటకు, సంఘసంబంధ కార్యములకు లాగి నాగూర్చి ఏవోచెడుగులు చెప్పి తనకు నాయెడలవున్న ప్రేమను విరుగుడు చేసినది. ఆమెమాటలను నమ్మి ఆమెపక్షముగా నిలిచి తుదకు ఆ లేడి మిషనెరీ సంఘస్తుల ప్రేమాదరణలు పోగొట్టుకొన్నది.

ఆమెకు ఒక చెల్లెలుండెను. ఆమె పేరు మిస్ మంజులాబాయ్ నారాయణ దాస్. ఆమె బైబిల్ స్త్రీ, ఆమె పనియేమంటే కష్టాలలో ఉన్న గృహములు దర్శించి వారు పడుచున్న బాధలను చూచి, తన అక్కతోచెప్పి సంతోషించడం. ఇది వారి అనుదిన చర్య. అట్టి సమయములో ఒకదినమున నా ఇంటికి వచ్చి నాచెల్లెలిని, "మమ్ము చూచి దాగుంటున్నావే" మని అడిగినది, ఆమెతో అప్పుడు దివానుగ పనిచేయుచున్న సైమన్ గారి భార్యకూడావచ్చి, మాకష్టములు చూచి కనికరించుట, యీమనిషికి యిష్టములేదు కనుక ఒక

విధమైన సంభాషణ చేసినది. నేను వెంటనే ఆమెతో "అమ్మా! నీ చరిత్ర అందరికి తెలుసును, నీ ప్రవర్తన బరంపురములో అందరికి తెలుసు" నంటిని. సంగతిగ్రహించి దివానుగారి భార్య ఆమెను తీసుకొని పోయినది. నేనెట్టి కష్టములలో వుంటినో గ్రహించుటకు దీని నిచ్చట వ్రాయుచున్నాను.

ఇట్టి పరిస్థితులలో అనగా సంఘములో బాధ, ఇంట్లో రోగముతో వున్న బిడ్డ విషయమై బాధ, శరీరములో బాధ సహించనలవి కాని శ్రమలలో ఒక ఉదయము తలుపు తట్టుటవిని తలుపు తీయగ ఎదురుగా కాలేజి ప్రిన్సిపల్ (మిస్టర్ రేగ్‌లాండ్). ఆయన తన కష్టములు చెప్పుకొనుటకు వచ్చెను. తెల్లవారుజాము 4 గంII. ఆయన నాకంటె బాధలో వున్నట్లు గ్రహించి తనను కుర్చీమీద కూర్చోపెట్టితిని. సంభాషణ ఆయనే మొదలిడెను, 14 సంII గా కాలేజి ప్రిన్సుపాల్‌గా పని చేస్తున్న తనను, పర్లాకిమిడి మహారాజావారు నిర్హేతుకముగా పనినుండి తొలగించారు, ఆయన గుండె ఆగిపోవునేమోయని ఆయన స్థితిని చూచిన నాకనిపించినది. "మీరు దైవసేవకులు నా కష్టములు మీతో చెప్పితే కొంచెము నాకు నెమ్మది కలుగునని వస్తి" నన్నారు. ఇద్దరము మోకరించి ప్రార్థించినాము. ధైర్యపరచినాను. పాష్టర్లూ!, మన కర్తవ్యమెంత ప్రాముఖ్యమైనదో గ్రహించండి. మనకష్టములు ఒక ప్రక్కఉంచి ఇతరుల కష్టములలో పాలు పంచుకొనవలసి యున్నది. తమ బాధల కంటె ఇతరుల బాధలలో సాయపడి వారిని ధైర్యపరచడము సంఘకాపరి కర్తవ్యము.

నన్ను అతిమిక్కిలిగా ప్రేమించిన నాతల్లి (పుష్పలలనమ్మగారు) నన్ను ఉద్యోగమునుండి తొలగించుటకు సకల ప్రయత్నములు చేయుచుండెను. కారణమేమనగా, తన మామ టెక్కలి సంఘ పాస్టరుగా ఉండెను. తానొక తప్పుకు దొరికినందున ఆనాటి మిషనరీ వానిని ఆదివారము పులిపిట్ నుండి క్రిందకు దించి తరిమివేసెను. అతడు కుమారుని ఇంటికి చేరుకొనెను.

కుమారుడు డాక్టరు.(డా. పి.డి. సామ్యూల్) వానిని పాస్టర్ ఉద్యోగమందు పెట్టుటకు తన కోడలైన ఈ అమ్మ, నన్ను ఉద్యోగమునుండి వేరొక స్థలమునకు బదిలీ చేయుటకు చేయరాని ప్రయత్నములు చేయుచుండెను. కాని సంఘమామె కోరికను మన్నించలేదు. ఆమె మామగారు సంఘపాస్టరుగా రావటము సంఘమునకు ఇష్టము లేకుండెను. ఆమె ప్రయత్నములు కొనసాగనందున ఆమెలోని ద్వేషము అత్యధికమయ్యెను. నన్నుగూర్చి మహాసభకు తెలియచేసెను.

ఆ దినములలో మహాసభకు రెవ.ఎ.బి. మాసిలామణిగారు కరెస్పాండింగ్ సెక్రటరీ, రెవ. చెట్టి దేవసహాయముగారు రికార్డింగు సెక్రెటరీగా ఉంటిరి. ఈమె అనగా పుష్పలలనమ్మ యెడల వారికి అధిక గౌరవము ఉండేది. వారికేకాదు తక్కిన ముఖ్యులకుకూడా తనయందు గౌరవముండేది. వారిద్వారా నాకు ఒకనోటీసు ఇప్పించినది. “మీ సంఘమును మహాసభనుండి తీసివేసితిమి. మీ ఫీల్డుకౌన్సిలుకు రావలసినడబ్బు ఆపుచేసితిమి”. ఆ దినములలో నేను ఫీల్డుకౌన్సిలు ప్రెసిడెంటుగాయుంటిని. మా ఫీల్డులో నలుగురు స్కూలుమాస్టర్లు, ఒక బోధకుడు ఉండేవారు. వారికి సుమారుగా నెలకు 105 రూ॥ జీతము ఇచ్చేవాడిని. అది ఆగిపోయినది. ఈ వార్తవిన్న పనివారు నా దగ్గరకు వచ్చి సంగతి తెలుసుకున్నారు. వారిని భయపడవద్దు అనిచెప్పి, నేనే ఆ జీతములను మూడునెలలవరకు ఇచ్చుచుంటిని. మహాసభవారికి కొంచెము ఆందోళన కలిగినది. మిషనరీలకు ప్రత్యేకముగా ఒక కాన్ఫరెన్స్ ఉండేది. వీరు, వారు కలసి ఆలోచించి రెవ జాన్ హార్ట్ దొరగారిని సంగతి తెలుసుకొనుటకు పర్లాకిమిడి పంపినారు. నా కార్యములు సక్రమముగా నేను జరుపుకొనుచుంటిని. ఫీల్డుకౌన్సిలు నెలకొకమారు జరిపించుచుంటిని. హార్టుదొరగారు తప్పు ఎక్కడున్నదో గ్రహించి,

మూడునెలలకు రావలసిన ఫీల్డుకౌన్సిలు సొమ్మును వెంటనే పంపమని టెలి(గ్రాముద్వారా తెప్పించి, "పాష్టరుగారు మీరే ఫీల్డుబాధ్యత వహించండి" అనిచెప్పి వెళ్లిపోయిరి.

కాని వారు తన మామను పాస్టరుగా నియమించుటకు (శద్ధ చూపలేదు. అగ్నిలో ఆజ్యంపోసినట్లు తనహృదయము మండుచుండెను.

**జైలునుండి తప్పించబడుట:** ఆరోజులు రెండో (ప్రపంచయుద్ధము ముగిసిన తరువాత రోజులు. ఏ వస్తువు కొనవలెనన్న సర్కారువారి సెలవు పొందవలెను. అట్టి సమయములో, నేను 20 జింకురేకులకు పర్మిట్ పొంది కొనుక్కొనియుంటిని గాని, పర్మిట్ వెనుక ఉన్న షరతులు నేను చదువలేదు. అందువలన రేకులు అవసరం ఉన్న ఇద్దరు స్నేహితులకు బదులు ఇచ్చియుంటిని. ఆమె ఆ సంగతి తెలుసుకొని, ఒకదినము చిరునవ్వు నవ్వుతూ "బాబూ! నాకు రేకులు ఇస్తారా, బదులుగా" అని అడిగెను. జరిగిన సంగతి యధార్ధముగా ఆమెకు చెప్పియుంటిని. ఈ సంగతి వెంటనే సివిల్‌సప్లైస్ ఇన్‌స్పెక్టర్‌కు తెలియపరచినది. ఆయన నన్ను అడుగగా యధార్ధమంతా చెప్పితిని. ఆయన నామీద యస్.డి.ఒ. బరంపురం, కోర్టులో కేసు పెట్టినాడు. ఆయనదగ్గర గుమస్తా ఒక (కైస్తవుడు, నన్ను ఎరిగినవాడే గాని, నా విషయమై యస్.డి.ఒ. కి తెలియపరచలేదు. కేసు ఉన్నంతకాలం పాస్టరు పుల్‌పిట్ ఎక్కరాదని అమ్మగారే సంఘములో కోరుతూ పై సంగతులు సంఘమునకు విశదముగా చెప్పగా, సంఘమునకు నాయందు కనికరమే కలిగినది కాని వేరేభావం కలుగనందున, నాకొరకు (ప్రార్ధనలు చేసిరి. మూడు నెలలు అయినది. వాయిదాకు బరంపురము వెల్లియుంటిని. యస్.డి.ఒ. గారు ఒక సం॥ కఠిన జైలుశిక్షయని జడ్జిమెంటు చెప్పినారు. అప్పుడు తనదగ్గరున్న గుమస్తా నాగూర్చి చెప్పినాడు. యస్.డి.ఒ. "నాతో ఈ సంగతి ముందే

ఎందుకు చెప్పలేదు'' అని వానిని గద్దించి వెంటనే బెయిలుకు ప్రయత్నించమను, అంతవరకు కోర్టులో ఉంటానని చెప్పగా, బెయిలుకై ప్రయత్నము చేయుటకు నాతో ఎవ్వరు లేరు. నేను ఒక్కడినే కోర్టులో ఉంటిని. ఏమి తోచక నిశ్చేష్టుడనై నిలిచి ఉంటిని. అప్పుడు సా॥ 6గం॥. బరంపురంలో నా పెదతండ్రి కుమార్తె ఉండెను. తన కుమారుడు బాబూరావు మంచి పలుకుబడి కలవాడు. మామ కోర్టునుండి ఇంకా రాలేదా? 6 గం॥ అయినదని నాకొరకు సైకిలుమీద వచ్చి సంగతి తెలుసుకొని నన్ను జైలులోపెట్టుటకు సిద్ధముగా ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్ళతో, "అతను నామామ, పాస్టరు, అతనిని ఏమి అనవద్దు" అని చెప్పెను. "పాస్టరు" అన్నమాట వినగానే ఇద్దరు పోలీసులు భయపడి నా సమీపమునకు రాలేదు. ఇద్దరు జామీనుదారులను తీసుకువచ్చి నన్ను బెయిలుపై విడిపించుకొచ్చినాడు. నాపట్ల దేవుడు ఎంత దయగలవాడో నేను చెప్పుటకు నా శక్తి, జ్ఞానము చాలదు. ఆ రాత్రి యస్.డి.ఒ. నేను విడుదలగు వరకు కోర్టులోనే ఉండెను. ఆయనలో అట్టి కనికరము నాయందు పుట్టించినది ఎవరు? "దేవా నాహృదయపూర్వక వందనము నీకే అర్పించుచున్నాను". ఆరాత్రి 7:30 గం॥ బస్సుపై పర్లాకిమిడి వచ్చి నా భార్యతో చెప్పినాను. ఆమె బహుగా ఆనందించి దేవున్ని స్తుతించినది. దేవునికృప నాయెడల ఎంతగానుండెనో చెప్పలేను. "ఆపదకాలములో యెహోవా నిన్ను ఆదుకొనును". నేను జడ్జికోర్టులో అపీల్ చేసినాను, ఒక మంచి ప్లీడరును నియమించాను. ఒక నెలలో కేసుతీర్మానమైనది. సంవత్సరపు శిక్ష నూరురూపాయిల ఫైనుతో ముగిసినది. ఆదివారము పులిపిట్ మీదకు వెళ్లి సంఘమునకు నాకు జరిగిన ఈ జయమును గూర్చి చెప్పినప్పుడు, ఆతల్లి, తన సోదరి ఆరాధన నుండి లేచి, గొణుగు కుంటూ వాళ్లయింటికి వెళ్లిపోయినారు. సంఘస్తులు వారి చేష్టలకు అసహ్యించుకొన్నారు.

"తెలియక చేసిన తప్పునకు తక్కువ శిక్షతో బయటపడుట దేవునిచిత్తమే"

**ట్రెజరర్స్‌తో తిప్పలు:** ఒక యౌవనస్తునకు(ఒరిసి కరుణాకర్‌రావు) నేను ముంచడమిచ్చి సంఘ కోశాధికారిగా నియమించితిని. ఆ యౌవనస్తుడు నామీదకే తిరగబడి జీతమిచ్చుటకు నన్నెన్నో తిప్పలు పెట్టినాడు తుదకు సంఘాన్ని రెండు ముక్కలుగా చీల్చుటకు ప్రయత్నము చేసినాడు. ఇటువంటి భయంకరులు సంఘములో ఉంటారు. వారి విషయమై పాస్టరులకు సహింపు అవసరము.

1941డిసెంబరులో పాస్టరుగా చేరినప్పుడు నా నెలజీతము రూ 30/-. 1960 సరికి రూ 60/-. 1970లో రూ 130/-. 1980 లో పదవీ విరమణ సరికి రూ 200/-.

ఒకపర్యాయము నేను, నాకుమార్తెలు ఇద్దరు ఉంటిమి. అవి సెలవుల కాలము. నా భార్య ఒక కుమారుడు ఒక కుమార్తెతో నా పెద్దకుమార్తె ఊరికి వెళ్ళియుండెను. అట్టి సమయములో ఒకదినము ఇంటిలో బియ్యము లేవు. చేతిలో డబ్బులేదు. ఉదయమే బయలుదేరి, ఐదుమైళ్ళు దూరమందున్న ట్రెజరరుదగ్గరికి(తుమ్మి చంద్రభూషణం, కొరసవాడ) అడ్వాన్సు అడుగుటకు వెళ్ళితిని. అతడు నిరాకరించెను. నిస్పృహతో ఇంటికి వచ్చితిని. పిల్లలు నన్ను భోజనమునకై పిలిచితిరి. "ఏలాగమ్మ! బియ్యము తెచ్చితిరి?" అనిఅడిగాను. "ఇద్దరు బైబిలు స్త్రీలు వచ్చి 12 రూ॥ ఇచ్చి వెళ్ళారు". అని చెప్పారు. నిజముగా దేవుడే కష్టములలో ఉన్న మనకు సహాయము పంపును.

ఇంకొక సంగతి మరపురానిది. మా సంఘము నాకు కొన్నినెలలు జీతమియ్యలేకపోతిరి. మిషనరీవారికి ఈ విషయము తెలిసినది. ఒక ఆదివారము ధారాళముగా చందాలువేసిరి. నాజీతము మొత్తము నాకు

ముట్టినది. ఇది దేవుని ఏర్పాటే.

కరుణాకర్‌రావు ఖజానాదారుడుగా ఉండగా నా చిన్నకుమారుడికి టైఫాయిడ్. నా చేతిలో డబ్బులేకుండెను. డాక్టరునకు, మందులకు డబ్బుకావలసి వచ్చినది. నా మరియొక కుమారుని అడ్వాన్సు నిమిత్తము ట్రెజరరు వద్దకు పంపితిని. "ఇప్పుడు నాకు సమయములేదు. తరువాత రమ్మన్నందున" నా కుమారుడు నిరుత్సాహముతో ఇంటికి వచ్చి సంగతి చెప్పినప్పుడు నాలో నీరసము, కోపము కలిగినది. మిషనరీలకు ఈ సంగతి తెలిసిననూ ఏమీ చేయలేకపోతిరి.

లేడీ మిషనరీకి(ఎడిత్ క్లట్టన్) నా విషయమై లేనిమాటలు చెప్పినందున అమాయకురాలైన ఆమె తన బంగళాలో ప్రార్థన సభకు రమ్మని నాకు ఒక చీటి వ్రాసి పంపినందున, నేను తన బంగళాకు వెళ్లితిని. అచ్చటి వాతావరణమును గ్రహించితిని. వెనుకకు వచ్చుటకు వీలులేదు. ప్రార్థనకని పిలిపించితిరి కనుక, ఎవడైతే జీతమిచ్చుటకు అల్లరి చేయుచుండెనో, వాడు, వాని తల్లితండ్రులు, గోపినాధుదేవుగారు, ఇతరుల బాధలను చూచి ఆనందించే ఆ బైబిల్‌స్త్రీ మాత్రమున్నారు. ఎవడైతే ఖజానాదారుగా ఉండి అల్లరిచేయుచున్నాడో వాడు, ప్రతీ ఆదివారము చందాలెక్కలు ఆలయములోఉన్న పుస్తకములో వ్రాయవలెనని సంఘము నియమించినది. వాడట్లు చేయనందున బిజినెస్ సభలో నేను వానితో "ఎందుకు మూడువారములనుండి సంఘపుస్తకములో లెక్కలు వ్రాయలేదని" అడుగగా, చాలా అమర్యాదగా జవాబు ఇచ్చినాడు. "అయితే నీవు రోగ్ వన్నమాట". అని నేనంటిని. అందుకై నాతో క్షమాపణ చెప్పించుట ఈ సభ ఉద్దేశమని గ్రహించినాను. ఆ బైబిల్‌స్త్రీ, బైబిల్ చదువుతూ ప్రార్థనలు వారితో చేయించుచూ, "తప్పులు ఒప్పుకొనుట మంచిది" అని, మధ్యమధ్యలో

హెచ్చరించుచుండెను. ఆలాగు సాయంత్రము ప్రారంభించిన సభ, రాత్రి 12గం॥ వరకు పొడిగించబడుచుండెను. ఆరోజులలో పర్లాకిమిడిలో రెవ. డాన్ ఫాస్టర్ అనే మిషనరీ ఉండెను. ప్రార్ధనాసభ జరిగించుచున్నాము. నీవుకూడా రావలెనని మిస్సమ్మగారు దొరగారిని కోరియుండెను.

దైవసహాయము యేరీతిగా ఉన్నదో ఇందుమూలముగా గ్రహించగలరు. ఆ మిషనరీ ఆ రోజు ఉదయం క్యాంపుకు వెల్లి రాత్రి 11గం॥ వచ్చి స్నానము చేసి నిద్రించుటకు వెళ్ళుచూ మిస్సమ్మగారు సభకు రమ్మన్నారు వెళ్ళి వస్తానని నైట్‌వాచర్‌తో చెప్పగా "ఇంకా మీటింగ్ ఉంటుందా, 12గం॥ కావస్తున్నదన్నను", ఆయన జీపుమీద మిస్సమ్మ బంగళాకు వచ్చెను. "ఎంతవరకైనది" అని మిస్సమ్మనడగ్గానే, "ఇంకా ఏమి కాలేద"న్నది. ఆయన ఆ ట్రెజరర్ వైపు చూసి, "ఈ అల్లరంతా నీవలనే వచ్చినదని" వానితో చెప్పగా, ఆ ట్రజరర్ తల్లి "ఏమంటున్నాడురా దొర" అని తన కుమారునడగగా "వీడికి బుర్రలేదమ్మా" అన్నాడు. ఆ దొరగారికి తెలుగు రాదు, గాని మిస్సమ్మకు వచ్చును. వెంటనే ఆమె వానితో "ఇది అమర్యాదగా మాట్లాడే స్థలము కాదని" కోపముతో అనగా అందరు లేచిపోయిరి. అప్పుడు రాత్రి 12గం॥. దొరగారు నన్ను తన జీపుమీద ఇంటికి దిగబెట్టి, గోపినాథు దేవుగారితో తనబంగ్లాకు వెళ్ళిపోయిరి. దేవుగారి గృహము బంగళా సమీపంలోనే ఉన్నది. ఈ రీతిగా దేవుడు నన్ను ఆదుకొన్నాడు. పాస్టర్లకెపుడూ కొందరు సంఘస్తులే శత్రువులు. కనుక సహనము, ఓర్పు పాస్టర్లకవసరము. జయము కడగా వారికే కలుగును.

**<u>సంఘమునుండి అల్లరిచేయువారు తొలుగుట:</u>** ఇది ఆఖరిగా జరిగిన గొప్ప సంగతి. దేవుడేరీతిగా నాకు సహాయకుడైనాడో ఆయన నాయెడల జరిగించిన ఆశ్చర్య కార్యమును చదువుచున్న మీరే గ్రహించగలరు.

1968 సం॥ లో నన్ను పాస్టరు పనినుండి తీసివేయుటకు నిశ్చయము

చేసుకొని సుమారు డెబ్బైమంది సభ్యులు గ్రామాదులనుండి వచ్చినారు. నేనుకూడా నిరుత్సాహముతో ఉంటిని, గాని ప్రార్ధనలు చేయుచున్నాను. నాప్రక్కనే సంఘ లేఖికుడు కూర్చొని బండబూతులు నన్నంటున్నాడు. నేను మనస్సులో ప్రార్ధనలు చేసుకొనుచున్నాను. సభలో గందరగోళము జరుగుచున్నది. నన్ను పాస్టరుగా తెచ్చిన ఆమె వారికి నాయకత్వము వహించినది.

ఒకడు లేచి ఈ పాస్టరు మాకవసరములేదని వోషనుచేసి మరియొకడు సెకండు చేస్తే నాటితో నాపని ఆ సంఘములో పూర్తి అయిపోవును. నా పాస్టరుపని ఆ సంఘములో ముగిసిపోవును. నాకనుకూలురైనవారు ఎవ్వరు ఆ సభకు రాలేదు. కారణమేమంటే నాకు విరోధముగాఉన్న ఆ అమ్మగారివద్ద తమకున్న మొగమాటమే. ఇంతలో ఒకసభ్యుడు లేచి "ఈ సంఘముతో మాకుపనిలేదు. మేము వేరుగా ఒక సంఘము స్థాపించుకొంటామని" అనగానే డెబ్బై మంది సభ్యులు లేచి బయటకు వెళ్ళిపోయిరి. 12మంది సభ్యులు మాత్రం ఉండిపోయిరి. వారితోనే మరికొంతమంది సభ్యులకు ముంచడమిచ్చి సుమారు 12 సం॥ అల్లర్లులేకుండా సంఘకార్యములు జరుపుకొనగలిగితిని. ఇది దేవుడు నాయెడల చేసిన ఆశ్చర్య కార్యము.

<u>**గొప్ప శోధన:-**</u> 1965-68 ప్రాంతంలో సి.బి.సి.యన్.సి. సంఘములలో ఒక గొప్ప అలజడి కలిగింది.కెనడా దేశమునుండి బెయిలీ దొరగారు వచ్చి తన సిద్ధాంతములతో సంఘములను, పాస్టర్లను ప్రలోభపెట్టుచుండెను. రెండవసారి బాప్తిసము తీసుకోవలెనని,డబ్బు ఆశచూపించి సంఘస్తులపై వత్తిడిచేసేవాడు.అప్పటికి నాకు నెలకు 100/- జీతము.బెయిలీ దొరగారు నెలకు రూ॥400/- జీతము ఇస్తానని ప్రలోభపెట్టినాడు. నా ఆర్థిక ఇబ్బందులు

తీవ్రముగా యుండెను. ఇద్దరు కొడుకులు పై ఊర్లలో ఉండి చదువుచున్నారు. ప్రార్ధనలు చేసిచేసి ఈ గొప్ప ప్రలోభమునుండి తప్పుకున్నాను." సైతాను శోధననుండి తప్పుకొనుకుటకు ప్రార్ధనా శక్తి అవసరము". బెయిలీ గ్రూపులో చేరిన వారు "క్రీస్తుసంఘము" గా ఏర్పడ్డారు.

నా కష్టములన్నిటిలో చాలా మట్టుకు ఆర్ధికముగా నన్ను ఆదుకొన్నది నా చెల్లెలు- లలితాబాయి చౌధరి-మిలటరీ స్టాఫ్ నర్సు. సంఘమునకు సంబంధించి గోపినాధు దేవుగారు నా పక్షము వహించేవారు.

**<u>గోపినాధు దేవుగారు:</u>** ఈయన నేను సంఘపాస్టరుగా ఉన్నంత కాలము నాకు కుడిభుజముగా ఉండెను. ఈయన, ఈయన మేనల్లుడు - లక్ష్మినారాయణ క్షత్రియకులమునకు చెందినవారు. ఆకులతంపర గ్రామస్తులు. వీరి యవ్వనకాలములో క్రైస్తవులైరి. వీరు బాప్తిసము తీసుకొనగానే వీరిద్దరిని బంధువులు చితకబాదిరి. మిషనరీలు వీరిని ఆదుకొని విద్య, ఉద్యోగములు కల్పించిరి. లక్ష్మినారాయణ నా వదినగారి భర్త. నా తోడల్లుడు. డాక్టరుగా సెరాంగోలో పనిచేసి మలేరియా జ్వరముతో చనిపోయిరి. మా వదినగారు తనఇద్దరు చిన్న కుమార్తెలతో, చిన్నచెల్లితో అనగా నా మరదలితో మద్రాసుపోయి స్థిరపడిరి. గోపినాధుదేవుగారు మంచి పొడగరి, సౌమ్యుడు. బోధకునిగా రామాయపట్నములో తర్ఫీతు పొంది పర్లాకిమిడిలో బోధకునిగా ఉండెను. ఈయన కుమారులు, కుమార్తెలు మంచి స్థితికి ఎదిగారు. ఈయన నేను కలిసి, గ్రామాలు తిరిగి సువార్తసేవ చేసేవారము.

**<u>సంఘముల స్థాపన:</u>** థియాలజి చదివేటప్పుడు నా సహవిద్యార్ధులతో - నేను కొన్ని సంఘములు స్థాపిస్థానని తరచు చెప్తూఉండేవాడిని. 1954సం॥లో "రౌతుపురము" సంఘము స్థాపించితిని. ఆ సమయంలో రెవ. జి.డి. బార్న్సు మిషనరీగా ఉండిరి. తరువాత ఈ సంఘము, రెవ, హేవర్డు దొరగారి

ఆధ్వర్యములో ఉన్న ఏజన్సీ (సవరా) మిషన్‌లో చేరినది. ఈ సంఘ పెద్ద 'డెమ్మా మేధి' మంచి విశ్వాసి. ఒకసారి ఆయన సైకిల్ పై వెళ్ళుతూ గుండె అగి మరణించుట చాలా విషాదకరము. తరవాత "సియాలుటీ" మరియు"కింగ" సంఘములు స్థాపించితిని. పర్లాకిమిడి సంఘపెద్దల నిర్వాకంతో కింగ సంఘంలో నేటికీ అల్లరులు చెలరేగుతున్నవి.

**సైకిల్ విషయము:** 1940, 1950 దశకములలో సైకిలు కలిగియుండుట గొప్ప విషయము. మిషనరీవారు నాకొక సైకిల్ ఇచ్చియుంటిరి. పర్లాకిమిడి ఫీల్డుమిషనుకు రెవ. జాన్ హోర్ట్‌గారు కొన్నిరోజులు ఇన్‌చార్జ్‌గా ఉండిరి. సంఘములో నన్నెప్పుడు అల్లరిచేసే అమ్మగారి మాటవిని, నాకు అవసరమున్నదని చెప్పి దొరగారు సైకిల్ తీసేసుకున్నారు. రెండురోజుల తరవాత మిలిటరీలో పనిచేయుచున్న నాచెల్లెలు నాకొక కొత్తసైకిల్ పంపినది. ఈ విషయము నాకు తెలియదు. ఒక లెక్చరర్ గారు రైల్వేస్టేషన్‌లో నా పేరనున్న సైకిల్ విషయము నాకు చెప్పినారు. వెంటనే వెళ్లి క్రొత్తసైకిల్ తెచ్చుకున్నాను. "అడగకమునుపే దేవుడు మన అవసరములు తీరుస్తాడు". నా క్రొత్తసైకిల్ విషయము తెలుసుకున్న దొరగారి మొఖము చిన్నపోయింది.

**ఆస్తులు కొల్పోవుట :** నా పేరను, నా భార్య పేరను 9 ఎకరముల వ్యవసాయ భూములు ఆకులతంపరలో ఉండేవి. సాగు హక్కుల పేరన, 1950 దశకములో రైతులు భూములను ఆక్రమించారు. కోర్టు ద్వారా పోరాడి భూములు స్వాధీనం చేసుకొని వెంటనే చవకగా అమ్మివేసాను. ఆ డబ్బు గృహ నిర్మాణంకొరకు, నాపెద్దకుమారుని డాక్టర్ చదువుకొరకు వినియోగించడమైనది.

**స్వంత గృహము:** ఆకులతంపర గ్రామములో మాకు ఇల్లు ఉన్నను 1956 సం॥ వరకు పర్లాకిమిడి మిషన్ కాంపౌండ్‌లో ఉంటిమి. పర్లాకిమిడి

మహారాజావారు నాలుగు ఎకరాల అరటితోట అమ్మగా మరో ఇద్దరితో కలిసి అది కొన్నాను. నా వాటా 1 1/2 ఎకరాలు. అందులో గృహము నిర్మించి 1958 జులైలో గృహప్రవేశము చేసినాము. ఇ.బి. లాక్‌హార్ట్ మిస్సమ్మగారు రిబ్బను కత్తిరించిరి.

మహారాజావారి వద్ద నుండి తోటను కొనుటకు, దివాన్ ఎన్.సి తామస్ గారు ఎంతగానో సహకరించిరి. అలాగునే గృహనిర్మాణముకై కావలసిన గుగ్గిలం చెట్లు, తాసిల్దారుగా నున్న బి.సి. మహాంతిగారు ఇప్పించిరి.

**క్రిస్‌మస్‌రాత్రి సమాధిక్రియ:** నేను పాస్టరుగా వచ్చిన తరువాత ఒక క్రిస్‌మస్ దినమున ఈ సంగతి జరిగినది. పర్లాకిమిడికి 18 మైళ్ల దూరములో ఉన్న ఒక క్రైస్తవ కుఱ్ఱవాడు, సుమారు 7 సం॥ వయస్సు ఉన్నవాడు, తన పందులను మేపుచుండగా అవి అదుపుతప్పి ప్రక్కపొలములో పడి మేయుచుండగా పొలముగలవాడు పందులను తోలివేయకుండా కఱ్ఱతో కుఱ్ఱవాని ప్రక్కలో పొడవగా అక్కడికక్కడే కుఱ్ఱవాడు ప్రాణము విడిచినాడు. ఆ శవమును సాయంకాలము మూడుగంటలకు పోస్టుమార్టము చేయుటకు పోలీసులు తెచ్చినారు. డాక్టరుగారు పోస్టుమార్టమైన తరువాత మీరు శవమును తీసుకొనిపొండని కబురంపినాడు. అప్పటికి 7 గం॥ రాత్రి. క్రైస్తవులందరు వారి ఆనందములో ఉన్నందున నేనే కార్యభారము వహించినాను. నా సైకిల్‌మీద పోస్టుమార్టం గది దగ్గరకు వెళ్ళినాను. చుట్టూ పెద్ద పొదలు, పాములు, నక్కలు తిరిగే స్థలము. పిల్లవాని శవము వరండాపైనే ఉన్నది. వెంటనే మేదరి వీధికి వెళ్ళి చిన్నపెట్టి తయారుచేయించి, తాళ్లుకొని ఆస్థలమునకు తెచ్చినాను. కాని పొదలుమధ్యనుండి ఆ చిన్న గదివద్దకు రెండువందల గజముల దూరము వెళ్లవలెను. నాకూ భయముగానే ఉన్నది.

ప్రార్ధన చేయుచున్నాను. ఇంతలో ఆ త్రోవలో ఒక వ్యక్తి వచ్చుట చూచి వానిని పిలిచినాను. వాడెవరో కాదు, ఆ శవమును కోసినవాడే. ఆ శవాన్ని తెచ్చుటకు సహాయము చేస్తావా అని ప్రశ్నించగా ఎంత ఇస్తావని బేరం పెట్టినాడు. 3 రూ॥ అనగానే సంతోషముతో ఒప్పుకొన్నాడు. బాగా త్రాగిఉన్నాడు. వానికికూడా భయముగనే ఉన్నది. నేను సైకిలుమీద తెచ్చిన మేదరిపెట్టె, తాళ్లు వానికిచ్చి పద అన్నాను. నీవు ముందునడిస్తే వస్తానన్నాడు. నేను సైకిలు పట్టుకొని ముందునడుస్తూ ఆ గదివద్దకు చేరుకున్నాను. వింతేమంటే శవము వరండామీద లేదు. పొదలలో వెతికినప్పటికి నక్కలు పొదలలో శవమును తినుట ప్రారంభించినవి. నాదగ్గర ఉన్న బ్యాటరీలైటువేసి నక్కలను తరిమి శవాన్ని పెట్టెలో పెట్టి తాళ్లతో కట్టి, పెట్టె పట్టుకోమని నాతో వచ్చినవానితో చెప్పినప్పటికి, వాడు లేడు. అప్పుడు నా స్థితి ఎలాగుండెనో మీరే ఊహించండి. భయముతో ఆ తాగుబోతు నావెనుక దాగియున్నాడు. నేను పెట్టె ఒకప్రక్క పట్టుకొని నడుస్తాను, మీరు రెండవప్రక్క పట్టుకొని నడువమన్నాడు. నేను సమ్మతించి ఆ ప్రకారము రెండువందల గజములు పొదలలో నడుస్తూ రోడ్డుకు చేరుకొన్నాము. అప్పుడు ఆ పెట్టె తన భుజముపై పెట్టమని కోరినాడు. ఆ రీతిగా సమాధి వద్దకు వెళ్లి సమాధి క్రియలు జరిగించి ఇంటికి వచ్చినప్పటికి రాత్రి 11గం॥ అయినది. అప్పుడు రాత్రి క్రిస్మస్ భోజనం కుటుంబముతో కలిసి తీసుకొనడం అయినది. ఆ బీదకుటుంబమునకు ఆ రీతిగా సహాయపడినందుకు నా హృదయము బహుగా ఆనందము పొందినది. నేటికిని ఆనందముగనే ఉన్నది.

**<u>త్రాగుబోతు వలన కలిగిన మేలు:</u>** నా సంఘమునకు చెందిన ఒక యవ్వనస్తుడు ఒక పిల్లను ప్రేమించి, ఆపిల్లవలన మోసపోయి ఉరి వేసుకున్నాడు. సమాధి చేయుటకు నాకు కబురు వచ్చినది. నేను మధ్యాహ్నాము

3గం॥ లకు ఐదుమైళ్లు దూరమునున్న ఆ గ్రామమునకు కొంతమంది సంఘసభ్యులతో కలిసి వెళ్లితిని. పెట్టెలో శవాన్ని పెట్టి సమాధికి సిద్ధముగా ఉన్నారు. చనిపోయిన కుర్రవాని బంధువులు చాలామంది వచ్చియున్నారు. అందులో ఒకడు పెద్ద త్రాగుబోతు. ఆ గ్రామములో 6 కుటుంబములే క్రైస్తవులు ఉన్నారు. వారిలో పార్టీలు. క్రైస్తవులు ఎక్కడుంటే అక్కడ పార్టీలు ఖాయం. ఇందులో అసత్యము లేదు. ఇందులో ఒకపార్టీవారు చనిపోయినవాని పార్టీమీద పోలీసుకు రిపోర్టుచేసిన సంగతి ఎవ్వరికీ తెలీదు. ఐదుగంటలైనది. సమాధికి సిద్ధపడి నన్ను తొందర చేయుచున్నారు. అట్టి తరుణమందు ఆ త్రాగుబోతు వచ్చి, "పాస్టరుగారు ఏలాగు సమాధిచేస్తారు? సమాధి చేయగానే ఆయనకు జైలుచేయరా? పోలీసువాళ్ళు ఎదురు పార్టీవాళ్లింట్లో ఉన్నారు", అని పెద్దకేకపెట్టి చెప్పగానే నాలో చలనం కలిగినది. నా తలలో జ్ఞానము కలిగినది. "సరే రేపు సమాధిచేస్తా"నని చెప్పి నాతో వచ్చిన క్రైస్తవులతో రాత్రి 8గం॥ ఇంటికి చేరుకున్నాను. ఆ త్రాగుబోతు ఆ రీతిగా కేకలు వేయకపోతే నేను సమాధి చేసియుందును. నన్ను అరెస్టు చేసియుందురు. దేవుడు నాయందు చూపిన కృప ఎంతగొప్పదో మీరే ఆలోచించండి.

**<u>వింత సంఘటన:</u>** 1973 సం॥ ప్రధమార్ధములో భువనేశ్వర్ నుండి ఒక ఒరియా పాస్టరుగారు పర్లాకిమిడిలో ఉజ్జీవ కూటములు నిర్వహించి, ఆఖరు దినమున నాచే ప్రభురాత్రి భోజనమిప్పించుటకు నన్ను ఆహ్వానించెను. నా సంఘమందు అల్లర్లురేపి, విడిపోయిన సభ్యులు ముందువరుసలో కూర్చొనియుండుటచూచి, వారివిషయము పాస్టరుగారికి చెప్పి "నాచేతులతో వారికి ప్రభురాత్రిభోజనము ఇవ్వలేను" అనిచెప్పాను. "అయితే మీ అవసరము మాకు లేదు, నేనే ఇవ్వగలను" అని ఆయన నాతో అనగానే నేను ఇంటికి వచ్చివేస్తిని.

నేను యింటికి చేరుకొనకముందే, ఒకపెద్ద "సుడిగాలి" సభాస్థలము స్టేజిపైనున్న కుర్చీలను, టేబుల్‌ను, ప్రభురాత్రి భోజన సామాగ్రితో సహా ఎగరకొట్టినది. ప్రభు భోజన సంస్కారము కాకుండానే సభ ముగిసింది. నా సంఘ సభ్యుడొకరు, మజ్జిగారు, స్టేజిపైకెక్కి ఆ పాస్టర్‌తో "నీతోటి దైవజనుని అవమానపర్చినందున, దేవుడే యీలాగు చేశాడు" అని అన్నాడు. "ప్రభువు చిత్తము అగమ్యగోచరము".

పాష్టరులారా! మీరు పనిచేస్తున్న సంఘములో గోముఖవ్యాఘ్రములుంటారు. పయోముఖ విషకుంభములుంటారు. మిమ్మును కలిసినప్పుడు మందహాసము చేస్తారు. వారు మీవలన ముంచడము పొందిన వారే. మీ వలన మేలు పొందినవారే, మీ యందు అభిమానము అనురాగము ఉన్నట్లు నటించిన వారే. వారు గొఱ్ఱె చర్మములు ధరించిన తోడేళ్లని గ్రహించి, జాగ్రత్తగా ఉండండి. ఓర్పుకలిగి, సహనము కోల్పోవద్దు. మీకునష్టము కలిగినప్పుడు లోలోన ఆనందించువారు, మీ సంఘములో వున్న సభ్యులే గనుక, ప్రార్థనయందు మెలుకువ గలిగి జాగ్రత్తగా వుండండి.

ఈ సంగతులైన తరువాత 12 సం॥ తొందరలేని సంఘజీవితము జీవించినాను. 39 సం॥ సంఘసేవ చేసినాక నేనే 1980 సం॥ రిటైరగుదునని సంఘమునకు మనవిచేసి పాష్టరుపని ముగించినాను. అయినను సైతాను నన్ను వెంబడించుచునే యుండెను. సంఘంలో కొందరు స్వార్థపరులు,మిషను ఆస్తులతో నాకు ఎలాంటి సంబంధము లేకున్నను నన్ను కోర్టుకు ఈడ్చిరి. నా పదవీ విరమణ తర్వాత పదేళ్ళలో నలుగురు పాష్టర్లు మారారు. గొఱ్ఱెల మధ్యనున్న తోడేళ్ళ చేతులలో "సంఘకాపరి" చిక్కుకొన్నాడు.

నేను రిటైరు అయిన సంగతి తెలిసి పెన్షను కమిటీ నాయకురాలు నాకొక వుత్తరము వ్రాసినది.

పాష్టరుగారు,

1. రూలు ప్రకారము మీరు 65 సం॥ వయస్సులో రిటైరు అవ్వ వలసినదిగాని పది సం॥ ఎక్కువ పనిచేసినారు.

2. మీరు ప్రతీనెల పెన్షను ఫండుకు కట్టవలసిన సొమ్ము కొంత కాలము నుండి కట్టలేదు. గనుక మీకు పెన్షను రాదు.

ఈ ఉత్తరము చదివి నేను ఒక విషయములో విచారించినాను "నా 39 సం॥ పాష్టరు పనిలో నూతనముగా మూడు సంఘములు స్థాపించినాను. నేను ప్రభువుకొరకు సమర్పించుకున్నాను అని బాధపడుచు ఆమెకు వెంటనే ఒక వుత్తరము వ్రాసినాను. "అమ్మా! మీ వుత్తరము చూచి సంతోషించినాను. నా గూర్చి దేవుడు ఆలోచిస్తాడు, మీరు గ్రామాదులందుండి పాష్టరుపనులు చేయుచున్నవారిని గూర్చి ఆలోచించండి". అని వ్రాసి సంతకము చేసి పంపినాను. ఈ నావుత్తరము కమిటీలో చదివినప్పుడు, సభ్యులందరము నవ్వుకొన్నామని ఆ కమిటి సభ్యుడొకడు నాతో చెప్పినారు. ఆయనే నా సంగతివిని 'మీరు ఫారెన్ బోర్డు సెక్రటరి యెలబెదొరగారికి వ్రాయండి, కొంత మేలు జరుగవచ్చునని సలహా ఇవ్వగా ఆ ప్రకారము రెవ. ఎలబెదొరగార్కి, కెనడా, వ్రాసినాను ఆయన తన జవాబులో, యీవిషయములో మాకు జోక్యములేదు. వారే, అనగా ఇండియాలోవున్న పెన్షను కమిటీవారే చూచుకొంటారని వ్రాసినారు.

ఇకను నేను అడగవలసిన వారెవరు? మనము ఆఖరిగా దేవుని అడుగుతాము గదా! ఆ ప్రకారము, "దేవా! నీ సేవకు నాకు కలిగిన బహుమానమిదేనా" యని ప్రార్థించు చుంటిని.

ఒకసాయంకాలము, స్టేట్‌బేంకు యూనియన్ సెక్రటెరి వచ్చి మిమ్ములొకమాట అడిగెదను, కోపమా! అని ప్రశ్నించినాడు. చెప్పండి యని

వానితో అన్నప్పుడు, ఆయన, ఈ రీతిగా అడిగినాడు, మీ పెరడు ఎకరా భూమి వున్నది. దానిని మాకు అమ్మితె కొంటామని అన్నారు. ఎంత యిస్తారని అడిగినాను. కారణమేమంటె దానిని తనఖాపెట్టి వేయిరూపాయిలు తేవలెనని ఒకని నడిగినప్పుడు యీస్థలమెవరికి అవసరము లేదు, మీ యిల్లు తనఖా యిస్తే వేయి రూపాయిలు ఇస్తానన్నాడు. అట్టి భూమి వీరెంతకు కొంటారో యన్న అనుమానముతో, ఎంత యిస్తారని ఆయన నడుగగ, ఒక లక్షా యాబదివేలు యిస్తామని జవాబు తననోటనుండి రాగానే దేవుని కృప ఎంతగానాయందు విస్తరించుచున్నదో యని మనస్సులో దేవుని కొనియాడుచు, నాకుమారునితో మాట్లాడి, రేపు మీకు చెప్పుతానని, ఆయనను పంపివేసి ప్రభువైన యెహోవా దేవుని స్తుతించుచుంటిని. నా ఐదవకుమారుడు ఒక్కడే యింట్లో వుండెను. తనతో ఈ విషయము చెప్పగా, మీరు ఆయనకు మాటఇచ్చినారా? అని నన్నడిగినాడు. నీతో ఆలోచించి చెప్పెదనని తనతో అన్నానని చెప్పగా సరేనన్నాడు. ఆతర్వాత ఆ స్థలమును ప్లాట్లుగా చేసి రూ|| మూడు లక్షల నలుబది వేలకు బేంకు వారికే అమ్మితిని.

ఆహా నాదేవుడెంత గొప్పవాడు! తన సేవకుని విడువలేదు, దేవుని నమ్ముకొనుటకంటే ముక్కున ఊపిరి గల నరుని నమ్ముకొనుట ఎంత బుద్ధిహీనత! ప్రియ పాస్టరులారా!, మీరు ప్రభువుని నమ్ముకొని ఆయనసేవ చేయండి.

చాలామంది పాస్టరులు, సంఘమందున్న నాయకుని, ట్రెజరరుని, సెక్రటెరీని, మాటకారియైన సంఘ సభ్యుని నమ్ముకొని, పనిలో ప్రవేశించి వారిని సంతోషపెట్టుచు, తమ పాస్టరు ఉద్యోగము నిలుపుకొనజూచి, వారి వలననే అమర్యాదపొంది పని నుండి నెట్టివేయబడునట్టి అనేక పాస్టరులను చూచి యీ మాటలు మీకు వ్రాయుచున్నాను.

నా అనుభవములు మీకు సహాయము చేయుగాక. ప్రభువు సేవే చేయండి. సంఘసేవయన్న ఉద్దేశము, మీలోనుండి తీసివేయండి. గాని సంఘస్తులను, ఆత్మీయ జీవితములోకి నడిపించే విషయములో కృషిచేయండి, ఇదే నామనవి........

**ప్రస్తుత నా కుటుంబ స్థితిగతులు:**

నా ముగ్గురు సంతానము గురించే మొదట్లో వ్రాసియుంటిని. మా దంపతులకు మొత్తం 6 గురు కుమార్లు 4 గురు కుమార్తెలు.

1. సామ్యేలు శాంతికుమారు యం.బి.బి.యస్. డాక్టరు. ఈ కుమారుడు నా యీ జీవిత చివరి దినములలో కుటుంబపరముగా, సంఘపరముగా నన్ను చాలా అల్లరి పెట్టినాడు.
   కోడలు - జయ హెల్మినా - రాజమండ్రి.
   సంతానము - స్టేన్లీ సంపత్ కుమార్, దయానా వారుణి, పాల్ వెస్లీ జయకుమార్

2. హిల్డా శశికుమారి - మెట్రిక్‌లేషన్ పరీక్ష ఫెయిల్ అయింది.
   అల్లుడు - పెదపెంకి కృపారావు నాయుడు, గుమ్మలక్ష్మీపురము.
   సంతానము - డా. రవిమోహన్, డా. ప్రదీప్ కుమార్, శశికాంత్

3. డేవిడ్ దేవదాస్ - యం.బి.బి.యస్. డాక్టరు. మిలటరీలో పనిచేశాక టాటామెయిన్ ఆస్పత్రిలో పనిచేయుచున్నాడు.
   కోడలు - రోజీ - మలయాళీ అమ్మాయి మిలటరీ నర్సింగ్ సర్వీసులో ఆఫీసరుగా ఉండెను.
   సంతానము - సందీపరాణి, జెస్సీ, జాయిస్, గ్రేస్

4. స్టేన్లీ సంపత్ కుమార్ - 1950 అక్టోబరు 28 న వంశధార నదిలో, తన 8వ యేట మునిగి చనిపోయాడు.

5. జేమ్స్ జయశీలు - యం.ఎస్.సి. (అగ్రి) చదివి ఒరిస్సా ప్రభుత్వములో కొన్నాళ్ళు పనిచేశాక యిప్పుడు స్టేటు బాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో మేనేజరుగా పనిచేయుచున్నాడు.
కోడలు - వసంత బి.ఎస్‌సి., బి.ఇడి.,-కంఠిమహంతివారి అమ్మాయి-జయపూరు.
సంతానము - ఇమ్మానుయేల్ సత్యశీలు, వినోలియా ఆరతి

6. హేనా రాజమణి - బి.ఎ.బి.ఇడి. చదివింది
అల్లుడు - రెవ. ఓగూరి బొల్లయ్య, యం.టి హెచ్.
(పిడుగురాళ్ళ,గుంటూరు జిల్లా )

7. డోరతి శాంతాబాయి - బి.ఎ., బి.ఇడి., చదివింది. చాపర జెడ్.పి. హైస్కూలో టీచర్.
అల్లుడు-పుల్లా నెహెమ్యా -బి.యసి., బి.ఇడి., (రామనగరు, హైదరాబాదు).

8. ఆర్థర్ దేవప్రసాదు - మెట్రిక్‌లేషన్ పాసయ్యాడు. నిరుద్యోగి.

9. లినోరా జమునాబాయ్ - యం.ఎ. చదివింది.
అల్లుడు - మత్తి కొర్నేలియస్ టిటో. యం.ఎ., (విశాఖపట్నం)
సంతానము - భరత్, కాంచన దీప, ఇమోజిన్ రేచల్

10. స్టేన్లీ రాజకుమార్ - బి.ఎ., బి.ఇడి., చదివాడు. నల్లగొండలో టీచరుగా పనిచేయుచున్నాడు. కోడలు - ప్రశాంతి రాజకుమారి, బి.ఎ., (శ్రీకాకుళం). ఈమె బండి జోగారావు నాయుడుగారి మనవరాలు.

సంతానము - నితీష్ నతానియేల్

దేవుని మహాకృపవలన నాకుటుంబ పరిస్థితి ఇది. నా ఐదవ కుమారుని విషయములోతప్ప మిగిలిన అందరి విషయములో సంతృప్తిగా ఉన్నది. వృద్ధాప్యమువలన నా ఆరోగ్యము క్షీణించుచున్నది. నాభార్య 02-10-1995 నాడు టాటానగర్‌లో చనిపోయి అక్కడే సమాధిచేయబడినది. నేను మరణించిన తరవాత నా సమాధి ఆకులతంపరలోఉన్న నా తల్లి సమాధిప్రక్కనే ఉండవలెనని నా కోరిక.నా యీ చివరి దినములలో నన్ను, నాకుమార్తెలు - రాజమణి, శాంతాబాయి, కుమారుడు దేవప్రసాద్, మనుమడు డా. ప్రదీప్ కుమార్, తన భార్య లిల్లీ చక్కగా చూచుకొనుచున్నారు.

**నా వంశావళి:** నా తండ్రి డానియల్ చౌధరి. తాతగారు గోపినాధ చౌదరి. ఆయనతండ్రి జగన్నాధ చౌదరి. ఈతడు కవి పురుషోత్తమ చౌధరికి అన్నగారు. ఈయన క్రైస్తవుడు కాలేదు. ఈయన మరణించిన తరవాత గోపినాధు చౌధరి, చిన్నాన్న పురుషోత్తమ చౌధరివలన క్రైస్తవుడాయెను.

నా భార్య ఇమోజిన్ - కళిమహంతి జేమ్సు అప్పన్న గారి ద్వితీయ కుమార్తె (తృతీయసంతానము). జేమ్సు అప్పన్నగారి తలిదండ్రులు - **సుభద్రమ్మ,** కళిమహాంతి **దీనబంధు**. **సుభద్రమ్మ** - అప్పలనసింహ చౌధరిగారి కుమార్తె. అప్పలనరసింహ - జగన్నాధచౌధరిగారి ఐదవ కుమారుడు. **దీనబంధు** - కళిమహాంతి రామకృష్ణ - భానుమతి గార్ల కొడుకు. భానుమతి - జగన్నాధ చౌధరిగారి పెద్దకుమార్తె.